

న్యూస్ బాక్స్

సీపీఎం జిల్లా కమిటీ ఏకగ్రీవం

జ్యోతినగర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సీపీఎం జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రెండు రోజులపాటు ఎన్టీపీసీలో జరిగిన మూడో జిల్లా మహాసభల సందర్భంగా జిల్లా కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శిగా మరోసారి వై యాకయ్య నియామకం అయ్యారు. కార్యదర్శివర్గ సభ్యులుగా ఎర్రవెల్లి ముత్యంరావు, ఎ మహేశ్వరి, వేల్పుల కుమారస్వామి, ఎం రామాచారి, జిల్లా కమిటీ సభ్యులుగా పలువురిని ఎన్నుకున్నారు.

నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

సుల్తానాబాద్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని వారితో సత్ప్రవర్తన కలిగి ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి అన్నప్రసన్న కుమారి అన్నారు. సుల్తానాబాద్ ప్రభుత్వ అసుపత్రిని సోమవారం డీఎం హెచ్‌వో ఆకస్మికంగా సందర్శించారు. ఆస్పత్రిలోని వివిధ విభాగాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. పలువురు సిబ్బంది సకాలంలో విధులకు హాజరుకాకపోవడంతో సమయపాలన పాటించాలని సూచించారు. అనంతరం ఆమె మాట్లాడుతు ప్రభుత్వ అసుపత్రిలో నాణ్యతమైన వైద్య సేవలు అందించాలని సూచించారు.



సాగు ప్రణాళిక ఖరారు

- జిల్లాలో 2,23,737 ఎకరాల్లో పంటల సాగు అంచనా
- గత ఏడాది కంటే పెరగనున్న సాగు విస్తీర్ణం
- అందుబాటులో 12,655 టన్నుల ఎరువులు, విత్తనాలు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

గడిచిన వర్షాకాలంలో ఆశించిన స్థాయి కంటే మించి వర్షాలుపడడం చెరువుల, కుంటలు, వ్యవసాయ బావులు నిండడం, సాగు నీటి ప్రాజెక్టుల్లో పుష్కలంగా నీళ్లు ఉండడంతో యాసంగి సాగుకు రైతులు ముందుకు కదులుతున్నారు. ఇప్పటికే వ్యవసాయ శాఖాధికారులు సాగు ప్రణాళికను సిద్ధం చేశారు. ఏఏ రకాల పంటలు పండించనున్నారు, ఎంత మొత్తంలో విత్తనాలు అవసరం కానున్నాయి, ఎరువులు ఎంత అవసరం కానున్నాయనే అంచనాలు సిద్ధం చేశారు. వచ్చే యాసంగిలో జిల్లా వ్యాప్తంగా 2,23,737 ఎకరాల్లో వరి, మొక్కజొన్న, తదితర పంటలు సాగు కానున్నాయని వ్యవసాయ శాఖాధికారులు అంచనా వేశారు. గత ఏడాది యాసంగిలో 2,22,442 ఎకరాల్లో పంటలు సాగు కాగా, ఈ ఏడాది అదనంగా 1,295 ఎకరాల్లో పంటల సాగు విస్తీర్ణం పెరగవచ్చని అధికారులు అంచనా వేశారు. ఎప్పటిలాగానే అత్యధికంగా వరి 1,98,500 ఎకరాలు, మొక్కజొన్న 15,400 ఎకరాలు, కంది ఐదు ఎకరాలు, శెనగ ఐదు ఎకరాలు, బబ్బెర 10 ఎకరాలు, వేరుశెనగ 35 ఎకరాలు, నువ్వులు 200 ఎకరాలు, పొద్దుతిరుగుడు 25, ఆయిల్‌పామ్‌తో పాటు కూరగాయల పంటలు 9,542 ఎకరాల్లో సాగు కానున్నాయని అధికారులు చెబుతున్నారు. ఈ పంటలకు 49,625 క్వింటాళ్ల వరి విత్తనాలు, 1,540 క్వింటాళ్ల మొక్కజొన్న విత్తనాలను అందుబాటులో ఉంచారు. ఈ పంటలకు గాను మొత్తం 67,061 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం అవుతాయని అంచనా వేశారు. ఇందులో యూరియా 37,000 టన్నులు, డీఏపీ 4,322 టన్నులు, మ్యూరేట్ ఆఫ్ పొటాష్ 4,175 టన్నులు, సూపర్ ఫాస్పేట్ 599 టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 20,965 టన్నులు అవసరమవుతాయని అధికారులు పేర్కొన్నారు. ప్రస్తుతం జిల్లాలో యూరియా 4828 టన్నులు, డీఏపీ 1118 టన్నులు, పొటాష్ 385 టన్నులు, సూపర్ ఫాస్పేట్ 778 టన్నులు, కాంప్లెక్స్ 5546 టన్నులు, మొత్తం 12,655 టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయి. గడిచిన వానాకాలం సీజన్‌లో 2,72,400

మిగతా 8వ పేజీలో....

విత్తనాలు, ఎరువులకు కొరత లేదు..



- దోమ ఆదిరెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖాధికారి

ఈ యాసంగి సీజన్‌లో జిల్లాలో గత ఏడాది కంటే సాగు విస్తీర్ణం పెరగనున్నది. జిల్లాలో ఇప్పటికే రైతులు వరి నార్లు పోయడం ప్రారంభించారు. వరి, మొక్కజొన్న విత్తనాలు అందుబాటులోనే ఉన్నాయి. 2,23,737 ఎకరాల్లో సాగు చేసే పంటలకు సరిపడా ఎరువులకు కూడా ఎలాంటి ఇబ్బంది లేదు. ప్రస్తుతం 12,655 టన్నుల ఎరువులు జిల్లాలో ఉన్నాయి. నెలవారీ కోటా ప్రకారం ఎరువులు జిల్లాకు చేరుకోనున్నాయి. విత్తనాలు, ఎరువులకు ఎలాంటి కొరత లేకుండా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంటున్నది.




కంపెనీ అధికారులతో చర్చిస్తున్న బయ్యపు మనోహర్‌రెడ్డి

కేశోరాం కార్మికుల సమ్మె

డిమాండ్‌లు పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన అధికారులు

8



గోదావరినదిలో ఎల్ మడుగు ప్రాంతం

పర్యాటక శోభకు శ్రీకారం

- ఎల్. మడుగు వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి నేడు శంకుస్థాపన

7

నాణ్యమైన ధాన్యాన్ని త్వరగా తూకం వేయాలి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తేమ వచ్చిన నాణ్యమైన ధాన్యాన్ని వెంటనే తూకం వేయాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష సూచించారు. మండలంలోని పెద్దకల్వల గ్రామంలో పెద్దపల్లి వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే తరలించాలని, ధాన్యం డబ్బులు రైతులకు సకాలంలో చెల్లించేలా వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని అధికారులకు ఆదేశించారు. కలెక్టర్ వెంట పెద్దపల్లి ఆర్డీవో గంగయ్య, తహసీల్దార్ రాజ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ వెంకటేష్ ఉన్నారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీసీవో శ్రీమాల

మంథని, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను నిర్వాహకులు వేగవంతం చేయాలని జిల్లా సహకార అధికారి ఇ శ్రీమాల సూచించారు. స్థానిక పీఏసీఎస్‌లో చైర్మన్ కొత్త శ్రీనివాస్‌తో కలిసి ఆమె సెంటర్ల సూపర్‌వైజర్లు, ఇంచార్జీలు, ట్యాబ్ ఆపరేట్ల తో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..నాణ్యత ప్రమాణాలు తప్పకుండా పాటించాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ట్రాన్స్‌పోర్టు వివరాలను ఎప్పటికప్పుడు రికార్డు చేయాలన్నారు. ఓపీఎంఎస్‌లో నమోదు చేసి ట్రక్ షీట్ జనరేట్ చేసి రైతుల బ్యాంక్ ఖాతాలో డబ్బులు జమయ్యే విధంగా చూడాలన్నారు. కొనుగోలు కేంద్రాలకు కావాల్సిన గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. దొడ్డు, సన్నం వడ్లు వేర్వేరుగా లారీల ద్వారా పంపించాలన్నారు. అనంతరం ఆమె పలు కేంద్రాలను సందర్శించారు. ఆమెను చైర్మన్ కొత్త శ్రీనివాస్ శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఏడీఏ అంజలి, సూపరింటెండెంట్ శ్రీనివాస్, అసిస్టెంట్ రిజిష్టర్ నరేష్, సీఈవో మామిడాల అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు దీక్షా దివస్‌పై బీఆర్ఎస్ పార్టీ సమావేశం

పెద్దపల్లి, నవంబర్ 25 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు ఈ నెల 29వ తేదీన నిర్వహించే దీక్షా దివస్ కార్యక్రమ నిర్వహణ కోసం ఈ నెల 26న ఉదయం 11 గంటలకు జిల్లాలోని బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో జిల్లా పార్టీ కార్యాలయంలో జరగనున్నదని జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి దీక్షా దివస్ ఇన్‌చార్జి మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యేలు దాసరి మనోహర్‌రెడ్డి, పుట్ట మధూకర్, తదితరులు హాజరు కానున్నారని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ సమావేశానికి హాజరు కావాలని చందర్ కోరారు.

ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి



దరఖాస్తులను స్వీకరిస్తున్న కలెక్టర్

పెద్దపల్లిటౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) ప్రజావాణి దరఖాస్తులను పరిశీలించి త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ అదనపు కలెక్టర్లు జే అరుణశ్రీ, డి వేణుతో కలిసి పాల్గొని ప్రజల దరఖాస్తులను స్వీకరించారు. సంబంధిత అధికారులకు కేటాయిస్తూ ప్రజల దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమానికి రెవెన్యూ శాఖకు సంబంధించిన ఆరు దరఖాస్తులు, ఇతర శాఖలకు సంబంధించి 19 దరఖాస్తులు మొత్తం 25 దరఖాస్తు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కమిషనరేట్‌లో ఐదుగురు ఎస్ఐల బదిలీ

కోల్‌సిటీ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రామగుండం కమిషరేట్ పరిధిలోని ఐదుగురు ఎస్ఐలను బదిలీ చేశారు. ఈ మేరకు కాళేశ్వరం మల్టీ జోన్ ఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్‌టీపీసీ, జూలపల్లి ఎస్ఐలకు స్థానచలనం కలిగింది. ఎన్‌టీపీసీ ఎస్ఐగా టీ ఉదయ్ కిరణ్‌ను నియమించారు. వీఆర్‌లో ఉన్న ఆయనకు పోస్టింగ్ ఇచ్చారు. ఎన్‌టీపీసీ ఎస్ఐగా ఉన్న సతీష్‌ను వీఆర్‌కు పంపారు. జూలపల్లి ఎస్ఐ ఎన్ శ్రీధర్‌ను పెద్దపల్లి సీసీఎస్‌కు బదిలీ చేసి ఆయన స్థానంలో మంచిర్యాల టౌన్ ఎస్ఐగా పనిచేస్తున్న సీహెచ్ సనత్‌కుమార్‌కు పోస్టింగ్ ఇచ్చారు. వీఆర్‌లో ఉన్న కే వెంకటేశ్వర్‌రావును చెన్నూరు ఎస్ఐ-2గా బదిలీ చేశారు.

దేవునిపల్లి జాతర ఆదాయం రూ. 14.80 లక్షలు

పెద్దపల్లి రూరల్ ,నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవునిపల్లి గ్రామంలోని శ్రీ లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలు నవంబరు 12 నుంచి 21 వరకు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో వచ్చిన ఆదాయాన్ని పెద్దపల్లి డివిజన్ దేవాదాయ, ధర్మదాయ పరిశీలకులు సుజాత, ఆలయ ఈవో ముద్దసాని శంకర్ సమక్షంలో హుండీలను సోమవారం తెరిచారు. హుండీల ద్వారా ఆరు లక్షల 51 వేల 126 రూపాయలు , సేవా టిక్కెట్‌ల ద్వారా రెండు లక్షల 53 వేల రూపాయలు , టెండర్ల ద్వారా 5 లక్షల 37 వేల 700 రుపాయలు, తై బజార్ ద్వారా 38వేల 650 రూపాయలు, మిశ్రమ వెండి 570 గ్రాములు, మిశ్రమ బంగారం 480 మిల్లి గ్రాములు రాగా మొత్తం 14 లక్షల 80 వేల 482 రూపాయల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ముద్దసాని శంకర్ తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బొక్కల సంతోష్, ఆలయ చైర్మన్ సదయ్య, ఆలయ ప్రధాన అర్చకులు కొండపాక లక్ష్మీనర్సింహచార్యులు తదితరులు పాల్గొన్నారు.

నేటి దేశవ్యాప్త నిరసనను జయప్రదం చేయండి

సుల్తానాబాద్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన దేశ వ్యాప్త నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం నిరసన కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముత్యంరావు మాట్లాడుతూ మంగళవారం అన్ని పట్టణ మండల కేంద్రాల్లో కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలను సమీకరించి నిరసన తెలపాలన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ తాండ్ర అంజయ్య, గుమస్తాల సంఘం అధ్యక్షులు మాతంగి రాజమల్లు, భగవాన్, స్వామి, శంకర్, తిరుపతి, రమేష్, ఓదెలు, సంజీవ్, కుమార్ పాల్గొన్నారు.

సన్మానం

రామగిరి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సెపక్‌తక్రా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన పూదరి సత్యనారయణగౌడ్‌ను బీఆర్ఎస్ నాయకులు జక్కు రాకేష్, శంకేషి రవీందర్, కాపురబోయిన భాస్కర్ ఆయన నివాసంలో సత్కరించారు. కార్యక్రమంలో ఎండీ ఇబ్రహీం, బుర్ర శంకర్‌గౌడ్ పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి సభ కోసం స్థల పరిశీలన

పెద్దపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 4వ తేదీన పెద్దపల్లిలో యువతతో సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించనున్న విజయోత్సవ సభ కోసం సంబంధిత అధికారులతో కలిసి సభా స్థలాలను జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సోమవారం పరిశీలించారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా వచ్చే నెల 4న సీఎం సభ నిర్వహించనున్న విషయం తెలిసిందే. ఈ సభలో గ్రూపు-4 ఉద్యోగాలు సాధించిన వారికి నియామక పత్రాలను అందజేయనున్నారు. సభ నిర్వహణ కోసం సంబంధిత అధికారులతో కలిసి పెద్దపల్లి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానాన్ని పరిశీలించారు. అలాగే కలెక్టరేట్ భవన సముదాయానికి ఎదురుగా రోడ్డు అవతల పెద్దకల్వల శివారులో గల ఖాళీ స్థలాన్ని పరిశీలించారు. గతంలో ఈ స్థలంలో కలెక్టరేట్ భవనం ప్రారంభం సందర్భంగా ఇదే స్థలంలో నాటి సీఎం కేసీఆర్ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపాలన విజయోత్సవ వేడుకలను డిసెంబరు 1 నుంచి 9వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా పండగ వాతావరణంలో జరపాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఇందులో భాగంగా డిసెంబరు 4న పెద్దపల్లి జిల్లాలో నిరుద్యోగ యువతతో విజయోత్సవ సభ జరుపుతుందని అన్నారు. నిరుద్యోగ విజయోత్సవ సభకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరు కానున్నారని, ఈ సభలో గ్రూప్-4 ఇతర వివిధ పోటీ పరీక్షలకు కింద ఎంపికైన తొమ్మిదివేల మంది అభ్యర్థులకు ఉద్యోగ నియామక పత్రాలను పంపిణీ చేయనున్నారని తెలిపారు. అనంతరం పెద్దకల్వలలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ వెంట పెద్దపల్లి ఆర్డీవో బి గంగయ్య, మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, తహసీల్దార్ రాజ్‌కుమార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



సీఎం సభ కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

99 శాతం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పూర్తి

జిల్లాలో 99 శాతం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పూర్తయిందని కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. సోమవారం సర్వే ఎన్యూమరేటర్లు పెద్దపల్లి కలెక్టర్ క్యాంపు కార్యాలయానికి చేరుకుని కలెక్టర్ కోయ శ్రీహర్ష కుటుంబసర్వే నిర్వహించారు. సర్వే సిబ్బందికి కలెక్టర్ పూర్తిగా సహకరిస్తూ వివరాలను తెలియజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ జిల్లాలో నవంబరు 24 నాటికి మొత్తం 2,46,167 ఇళ్ల సర్వే పూర్తయిందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 1,64,857 ఇళ్లు (100 శాతం), పట్టణ ప్రాంతాలలో 81,310 (97.37 శాతం) సర్వే పూర్తయిందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో పెండింగ్ సర్వే ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజల నుంచి సేకరించిన సమాచారం పకడ్బందీగా భద్రపర్చాలని కలెక్టర్ సూచించారు.

బాధితుల ఫిర్యాదులపై సత్వరమే స్పందించండి

- సీపీ శ్రీనివాస్

ఓదెల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): న్యాయం కోసం పోలీస్‌స్టేషన్లకు వచ్చే బాధితుల ఫిర్యాదులపై సత్వరమే స్పందించి, తగు న్యాయం చేయాలని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాస్ ఆదేశించారు. మండలంలోని పొత్కపల్లి పోలీస్‌స్టేషన్‌ను సీపీ శ్రీనివాస్, డీసీపీ చేతనతో కలిసి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా సీపీ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లోని ప్రధాన కూడళ్ల వద్ద విజబుల్ పోలీసింగ్ నిర్వహించాలని కోరారు. అలాగే వాహనాల తనిఖీలు చేపట్టి గంజాయి, మత్తుపదార్థాల సరఫరా, అక్రమ రవాణా, విక్రయాలు తదితర కార్యకలాపాలపై నిఘా ఉంచాలని సూచించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో పల్లె నిద్రను నిర్వహిస్తూ, ప్రజాసమస్యలను తెలుసుకుని సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ప్రజలకు దగ్గరవుతూ పటిష్టమైన సమాచార వ్యవస్థను ఏర్పరచుకోవాలని సూచించారు. అలాగే పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా, గుడుంబా తయారీ వంటి కార్యకలాపాలపై దృష్టి కేంద్రీకరించాలన్నారు. ముఖ్యంగా ఇంతకుముందు ఉన్న రౌడీ షీటర్ల కదలికలు, అలాగే సస్పెక్ట్ షీట్ల ఇళ్లను తప్పనిసరిగా తనిఖీలు చేయాలన్నారు. అంతకుముందు పోలీస్ స్టేషన్లోని రిసెప్షన్ కౌంటర్‌ను తనిఖీ చేసి బాధితుల నుంచి ఫిర్యాదుల స్వీకరణ, సంబంధిత రికార్డులను పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడి విధుల నిర్వాహణలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్‌స్టేషన్‌లోని రికార్డులు, సిబ్బంది వివరాలు, స్టేషన్ భౌగోళిక పరిస్థితులను తెలుసుకున్నారు. బ్లూ కోల్ట్స్, పెట్రోలింగ్ సిబ్బంది తనిఖీలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ, సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి, ఎస్సైలు అశోక్ రెడ్డి, శ్రావణ్‌కుమార్ ఏఎస్ఐ సుధాకర్ పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న సీపీ శ్రీనివాస్

బాలశక్తి మెగా వాలీబాల్ పోటీలు

సుల్తానాబాద్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలంలోని గర్రెపల్లి గ్రామంలో ఈనెల 30న బాలశక్తి మెగా వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు పోటీల నిర్వాహకులు, జాతీయ వాలీబాల్ క్రీడాకారుడు కన్న రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు పెద్దపల్లి జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ప్రిన్సిపాల్స్‌కు ఆహ్వానాలు అందించామని ఆయా స్కూల్స్ నుంచి తమ విద్యార్థులను ఈ పోటీలకు పంపించాలని కోరినట్లు వివరించారు. గర్రెపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ మైదానంలో నిర్వహించే పెద్దపల్లి జిల్లా స్థాయి బాలల మెగా వాలీబాల్ పోటీల నిర్వహణ కోసం అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని, దాదాపు నలభై టీమ్‌లు పోటీలో పాల్గొననున్నాయని పేర్కొన్నారు. జిల్లాస్థాయి పోటీలను ఎమ్మెల్యే విజయరమణారావు ప్రారంభిస్తారని తెలిపారు. పోటీల్లో పాల్గొనాలని ఆసక్తి గల వారందరూ ఈ నెల 30 వ తేదీ రోజున కూడా పాల్గొనవచ్చని తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీల సమస్యలు పరిష్కరించాలి

పెద్దపల్లిటౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) ఎస్సీ ఎస్టీ, బీసీ సమస్యలు పరిష్కరించాలంటే ధర్మసమాజ్ పార్టీ (డీఎస్పీ) ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరెట్ ఎదుట రాజీవ్ రహదరిపై ధర్నా చేపట్టారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా డీఎస్పీ జిల్లా కన్వీనర్ కనకం గణేష్ మాట్లాడుతూ కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్యను అందించాలని, నాణ్యమైన ఉచిత వైద్యాన్ని అందించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడం కోసం ప్రతి గ్రామంలో ఆధునిక ఆసుపత్రిని నిర్మించాలన్నారు. బీసీ, ఎస్సీ ఎస్టీ 90 శాతం పేద బడుగు బలహీన వర్గాల నిరుపేద ప్రజలకు ఉచిత విద్య, వైద్యం అందించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు అవునూరి సతీష్, ఏదుల్ల శంకరయ్య, రమేష్, ఆరేపల్లి అమర్, మాతంగి రేవంత్, శనిగారపు రాము, దిలీప్ కుమార్, రామ్ దర్శన్, ముకేష్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక అంశాలపై అవగాహన

కమాన్‌పూర్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి) : మండలంలోని రొంపికుంట గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలోని విద్యార్థులకు రామగుండం సీపీ ఆదేశాల మేరకు షీ టీమ్ సభ్యులు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహిళల రక్షణ కోసం తీసుకుంటున్న చర్యల గురించి అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ మోసాలు, సైబర్ క్రైమ్, హెల్ప్ లైన్ నెంబర్, 100 నంబర్‌లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో షీ టీమ్ ఇంచార్జీ మల్లన్న, షీ టీం సభ్యుడు సురేష్, హెచ్ఎం నిర్మల జ్యోతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

కిరాణా వ్యాపారి ఆత్మహత్య

జ్యోతినగర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ కృష్ణానగర్‌కు చెందినవేముల రాజమౌళి(38) సోమవారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబాల కలహాల కారణంగానే ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. పాలకుర్తి మండలానికి చెందిన రాజమౌళి ఐదేళ్ల క్రితం ఎన్టీపీసీకి వచ్చి ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్డులో కిరాణా షాపు నడుపుతున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. ఎన్టీపీసీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గోదావరి హారతిని విజయవంతం చేయండి

కళ్యాణ్‌నగర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా గోదావరి మహా హారతిని విజయవంతం చేయాలని గోదావరి హారతి ఉత్సవ సమితి రాష్ట్ర కో కన్వీనర్ క్యాతం వెంకటరమణ, కాశీవిశ్వేశ్వర ఆలయ ప్రధాన అర్చకులు ఒజ్జల వెంకటేశ్వరశర్మ కోరారు. సోమవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 2012లో మొట్టమొదటి సారిగా బీజేపీ జాతీయ నాయకులు మురళీధర్‌రావు నేతృత్వంలో ధర్మపురి లక్ష్మీనర్సింహస్వామి సన్నిధిలో గోదావరికి హారతి ఇవ్వడం జరిగిందన్నారు. బుధవారం గోదావరిఖని సమ్మక్క-సారలమ్మ జాతర గోదావరి ఘాట్ వద్ద హారతి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు, దీనికి పెద్ద ఎత్తున ప్రజలు తరలిరావాలని వారు కోరారు. దక్షిణ గంగా పిలువబడే గోదావరికి కార్తీక మాసంలో పూజలు చేయడం శుభప్రదమని తెలిపారు. సమావేశంలో ఉత్సవ సమితి సభ్యులు ఇసంపల్లి వెంకన్న, గజెల్లి వెంకటేశ్వర్లు, పొన్నం ఆంజనేయులు, కోడూరి రమేష్, మంజుల, శైలజ, మమత, రజిత, ప్రవంతి, వీరేశం, కనకయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న క్యాతం వెంకటరమణ

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

కోరుట్ల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఝాన్సీరోడ్డులో తాళం వేసి ఉన్న ఇంట్లో సోమవారం చోరీ జరిగింది. కాలనీవాసులు తెలిపిన వివరాల ప్రకారం... కాలనీకి చెందిన కొండబత్తిని గంగాకిషన్ - అరుణ దంపతులు ఇంటికి తాళం వేసి నాలుగు రోజుల క్రితం హైదరాబాద్‌కు వెళ్లారు. సోమవారం ఇంటి తలు పులు తెరిచి ఉండడంతో చుట్టు పక్కల వారు గమనించి గంగా కిషన్‌కు ఫోన్ ద్వారా విషయం చేరవేసారు. గంగాకిషన్ సూచన మేరకు బంధువులు ఇంట్లోకి వెళ్లి చూడగా ఇంట్లోని వస్తువులు చిందరవందరగా పడి ఉండడాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలాన్ని సీఐ సురేష్ బాబు తన సిబ్బందితో వచ్చి పరిశీలించారు. పోలీసులు క్లూజ్ టీం సహాయంతో తనిఖీలు నిర్వహించారు. గంగాకిషన్‌ను ఫోన్‌లో సంప్రదించగా బీరువాలో ఐదు తులాల బంగారు, వెండి ఆభరణాలతో పాటు నగదు ఉన్నట్లు తెలిపాడు.

రూ.80వేల నగదు.. వెండి అపహరణ

ఎల్లారెడ్డిపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్‌లో తాళం వేసి ఉన్న రాయవేని సురేందర్ ఇంట్లో చోరీ జరిగినట్లు ఎస్సై రమాకాంత్ సోమవారం తెలిపారు. ఇంట్లో నిల్వ చేసిన రూ.80 వేల నగదుతోపాటు 25 తులాల వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారని పేర్కొన్నారు. గ్రామంలోని సురేందర్ ఈ నెల 24న ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి సగ్గారమం రాజన్నపేటకు వెళ్లాడు. సోమవారం తిరిగి ఇంటికి వచ్చే సరికి తాళం పగులకొట్టి కనిపించింది. బీరువాను ధ్వంసం చేసి నగదు, వెండి అభరణాలను ఎత్తుకెళ్లారని తెలిపారు. బాధితుడు సురేందర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

జగిత్యాలలో చోరీ.. నగదు అపహరణ

జగిత్యాల క్రైం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రంలోని వాణినగర్‌లో చోరీ జరిగింది. గుర్తు తెలియని దొంగలు బోగ కృష్ణహరి అనే వ్యక్తి ఇంటిలోకి చొరబడి బీరువా తలుపులు పగులగొట్టి రూ.20 వేల నగదుతో పాటు తొమ్మిది తులాల బంగారు ఆభరణాలు అపహరించుకవెళ్లారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వేలి ముద్రలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మద్యం మత్తులో వాహనం నడిపిన వ్యక్తికి జైలు

జగిత్యాల క్రైం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి ద్విచక్ర వాహనం నడిసిన కేసులో ఒకరికి పది రోజుల జైలు శిక్ష విధిస్తూ జగిత్యాల కోర్టు న్యాయమూర్తి కరుణాకర్ సోమవారం తీర్పు వెలువరించారు. జగిత్యాల పట్టణానికి చెందిన ఉస్మాన్ షేక్ అనే వ్యక్తి అతిగా మద్యం తాగి అజాగ్రత్తగా వాహనం నడుపుతూ జగిత్యాల ట్రాఫిక్ ఎస్సై మల్లేశంకు పట్టుబడ్డారు. ట్రాఫిక్ ఎస్సై కేసు నమోదు చేసి కోర్టులో ప్రవేశపెట్టారు. న్యాయమూర్తి పది రోజుల జైలు శిక్ష విధించారు.

కుటుంబ కలహాలతో ఒకరి ఆత్మహత్య

కోరుట్ల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఐబీ రోడ్డులో నివాసం ఉంటున్న వ్యాన్ డ్రైవర్ తోట రాజన్న అలియాస్ తోట రాజిరెడ్డి (54) అనే వ్యక్తి ఉరి వేసుకుని సోమవారం ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం... నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణానికి చెందిన రాజిరెడ్డి కోరుట్లలో భార్యతో నివాసం ఉంటున్నాడు. కుటుంబ కలహాలతో పాటు మద్యానికి బానిసైన రాజిరెడ్డి సోమవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

వారసంత.. ప్రజలకు చింత

నిర్మాణం పూర్తయినా వాడుకలోకి తీసుకురాకపోవడంతో తిమ్మాపూర్ మండలంలోని మహాత్మానగర్ గ్రామంలో వారసంత అధ్వానంగా మారింది. అక్కడ చుట్టు పక్కల ఉన్నవారు వారసనంత వద్ద పశువులను కట్టేసుకుంటున్నారు. ఇతర అవసరాలకు వాడుకోవడంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. లక్షలు వెచ్చించి నిర్మించిన నిర్మాణాలు నిరుపయోగంగా మారడంతో పాటు నిర్వహణ లేకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద వారసంతల నిర్మాణం చేపట్టగా మహాత్మానగర్, రేణికుంట, నల్లగొండ గ్రామాల్లో నిర్మాణం పూర్తి కాగా నుస్తులాపూర్‌లో మధ్యలోనే పనులు నిలిపివేశారు. కొత్తపల్లి, మొగిళిపాలెంలో పనులు ప్రారంభించకపోవడంతో రద్దు అయ్యాయి. నిర్మాణం పూర్తయిన చోట వారసంతలను అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.



అధ్వానంగా మహాత్మానగర్ కూరగాయల వార సంత అవరణ

- అందుబాటులోకి రాక ప్రజలు, చిరువ్యాపారులకు ఇబ్బందులు
- మహాత్మానగర్‌లో నిరుపయోగంగా నిర్మాణాలు
- పట్టించుకోని పాలకులు

తిమ్మాపూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి పాలకులు తూట్లు పొడు స్తున్నారు. ఈ పథకం కింద లక్షలు వెచ్చించి నిర్మించిన నిర్మాణాలు ప్రజలకు అందుబాటులోకి తీసుకురాకుండా వాటిని పట్టించుకోకపోవడంతో అధ్వాన్నంగా మారుతున్నాయి. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా తిమ్మాపూర్ మండలానికి 2022లో మహాత్మానగర్, నుస్తులాపూర్, రేణికుంట, నల్లగొండ, కొత్తపల్లి, మొగిళిపాలెం గ్రామాలలో వారసంతలను నిర్మించిచేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వీటిని నిర్మించడం ద్వారా ప్రజలకు సౌకర్యంతో పాటు చిరు వ్యాపారులకు అనుకూలంగా ఉంటుందని, అంతే కాకుండా దీంతో గ్రామ పంచా యతీలకు కొంత ఆదాయం వస్తుందనే ఉద్దేశ్యంతో వీటిని నిర్మించేందుకు గత పాలకులు సిద్ధం అయ్యారు. కానీ ఇప్పటికీ అవి అందుబాటులోకి రాలేదు. మహాత్మానగర్, రేణికుంట, నల్లగొండ గ్రామాల్లో నిర్మాణం పూర్తి కాగా నుస్తులాపూర్‌లో మధ్యలోనే పనులు నిలిపివేశారు. కొత్తపల్లి, మొగిళిపాలెంలో పనులు ప్రారంభించకపోవడంతో రద్దు అయ్యాయి.


సంత లోపల కట్టేసిన పశువులు

మహాత్మానగర్‌లోని వారసంత అధ్వాన్నం

మహాత్మానగర్ గ్రామ పంచాయతీకి అతి సమీపంలో సుమారు 15లక్షల నిధులతో నిర్మించిన కూరగాయల వారసంత ప్రస్తుతం అధ్వానపరిస్థితిలో ఉంది. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుయని పనులు పూర్తి కాకున్నా గత ఏడాది అక్టోబరు 4న ఈ వారసంతను గత ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ప్రారంభించారు. ఆ రోజు వారసంతలో అంతా క్రయవిక్రయ దారులతో నిండుగా కనిపించే విధంగా చేశారు. అంతే మరుసటి రోజు నుంచి తిరిగి ఇప్పటి వరకు దాదాపు సంవత్సరం పూర్తి అయినా అందులో కూరగాయాల విక్రయాలు జరగలేదు. ప్రస్తుతం ఈ వారసంతలో స్థానికులు పశువులను కట్టేస్తున్నారు. గడ్డి పేర్చుకున్నారు బట్టలు ఆరబెట్టుకోవడం, మందు బాబులకు అడ్డాగా మారడంతో పాటు ఇతరాలకు స్థానికులు వినియోగించుకుంటున్నారు. ప్రస్తుతం కూరగాయలు బజార్ ఏరియాలో రోడ్డు పక్కన విక్రయిస్తున్నారు.

ప్రజలకు అందుబాటులోకి తేవాలి :

మహాత్మానగర్ గ్రామంలో లక్షలు వెచ్చించి నిర్మించిన వారసంతను అందుబాటులోకి తేవాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. వారసంతను నిర్మించడమే ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా నిర్మాణం చేయలేదని, రాజీవ్ రహదారికి సమీపంలో ఈ వారసంత నిర్మిస్తే ఇటు స్థానికంగా ఉంటే మత్యకారులకు, కూరగాయల విక్రయదారులకు, ఇతర చిరువ్యాపారులకు జీవనోపాధితో పాటు గ్రామ పంచాయతీకీ కూడా కొంత ఆదాయం వచ్చేదని ప్రజలు అంటున్నారు. రాజీవ్ రహదారికి సమీపంలో ఈ వారసంత ఉంటే రాహదారి వెంబడి వెళ్లే ప్రయాణికులకు కూడా తాజా కూరగాయలు, చేపలు, ఇతర వస్తువులు దొరికేవని ఇప్పటికైనా పాలకులు ఈ వారసంతపై దృష్టి సారించి ఉపయోగంలోని తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. వారసంతకు అనుకులంగా లేని పక్షంలో ఇతర ప్రభుత్వ అవసరాల కోసం నిర్మాణాలు వాడాలని ప్రజలకు కోరుతున్నారు. నిరుపయోగంగా ఉండటంతో నిర్మాణాలు శిథిలావస్థకు చేరుతున్నాయని గ్రామస్థులు పేర్కొంటున్నారు.


బట్టలు ఆరేసుకుంటున్న స్థానికులు

ఉద్యోగం ఇప్పిస్తామని మోసం

జగిత్యాల క్రైం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) :ప్రైవేటు ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి ఓ యువకుడిని మధ్యప్రదేశ్‌కు చెందిన వ్యక్తి మోసానికి పాల్పడ్డాడు. పట్టణానికి చెందిన వంశీ అనే యువకుడు డిగ్రీ పూర్తి చేసి ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేస్తున్నాడు. అన్‌లైన్‌లో ఇంటి వద్దనే ఉండి పనిచేసే ఉద్యోగం ఉందంటూ సోషల్ మీడియాలో వచ్చిన ప్రకటనకు వంశీ స్పందించాడు. దీంతో గుర్తు తెలియని వ్యక్తి ఉద్యోగం కావాలంటే రూ. 38 వేలు చెల్లించాంటూ నమ్మించాడు. దీంతో వంశీ గుర్తు తెలియని వ్యక్తికి రూ. 38 వేలను బ్యాంక్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేశాడు. . అప్పటి నుంచి గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఉండడంతో మోసపోయానని గమనించి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు జగిత్యాల టౌన్ పోలీసులు పేర్కొన్నారు.

దాడి కేసులో ముగ్గురిపై కేసు

జగిత్యాల క్రైం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : జగిత్యాల జిల్లా కేంద్రంలో స్వీట్ హౌస్ నిర్వహించే వ్యక్తిపై దాడి చేసిన కేసులో ముగ్గురు వ్యక్తులపై జగిత్యాల టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణంలోని తహసీల్ చౌరస్తా సమీపంలో స్వీట్ హౌస్ నిర్వహించే పునమ్ అనే వ్యక్తిపై జగిత్యాలకు చెందిన ముగ్గురు వ్యక్తులు స్వీట్లు కొనుగోలు చేసే సమయంలో అకారణంగా దాడికి పాల్పడ్డారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టౌన్ పోలీసులు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బైండోవర్ ఉల్లంఘన మహిళకు జైలు

రామగిరి, నవంబరు 25 నవంబరు (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్వచర్ల గ్రామానికి చెందిన బాలసాని సత్తెమ్మ అనే మహిళ బైండోవర్ ఉల్లంఘించడంతో జైలుశిక్ష విధించినట్లు మంథని ఎక్సైజ్ సీఐ రాకేష్‌కుమార్ తెలిపారు. సీఐ వెల్లడించిన వివరాల ప్రకారం.. గతంలో సత్తెమ్మ గుడుంబా విక్రయించగా తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు. బైండోవర్ ఆంక్షలు ఉల్లంఘిస్తూ గుడుంబా అమ్మకాలు కొనసాగిస్తుండగా కేసు నమోదు చేసి రామగిరి తహసీల్దార్ ఎదుట హాజరు పరచగా లక్ష జరిమానా విధించారు. జరిమానా చెల్లించకపోవడంతో తహసీల్దార్ 284 రోజుల జైలు శిక్ష విధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ సాయి, సిబ్బంది ఉన్నారు.

ఒకరి మరణానికి కారణమైన వ్యక్తి అరెస్ట్

సిరిసిల్ల క్రైం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తూ వ్యక్తి మరణానికి కారణమైన కోనరావుపేట మండలంలోని నిమ్మపల్లి గ్రామంలో ఉంటున్న రాజస్థాన్‌కు చెందిన కైలాస్‌రాం అనే వ్యక్తిని సోమవారం అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామని సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. తంగళ్లపల్లి మండలంలోని మండెపల్లి గ్రామ శివారులోని కెసిఆర్‌నగర్‌కు చెందిన మహ్మద్ సిరాజ్(45) అనే వ్యక్తి తన కుటుంబసభ్యులతో ఆటోలో గొల్లపల్లిలోని దర్గాకు వెళ్లి దర్శనం చేసుకొని తిరిగి తన అత్తగారి ఇల్లు అయిన చంద్రంపేటకు వెలుతుండగా ఈ నెల 10న కోనరావుపేట మండలంలోని నిమ్మపల్లి గ్రామంలో ఉంటున్న రాజస్థాన్‌కు చెందిన కైలాస్ రాం అనే వ్యక్తి ద్విచక్రవాహనంపై మద్యం సేవించి అతివేగంగా వచ్చి ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ ఆటో పక్కన నిలబడి ఉన్న సిరాజ్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో సిరాజ్‌కు తీవ్రగాయాలు కాగా ఈనెల 18న కరీంనగర్‌లో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య అఫ్రిన్ ఫిర్యాదు మేరకు కైలాస్ రాంపై కేసు నమోదుచేసి అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామని డీఎస్పీ తెలిపారు.

ఆరుగురికి ఏడాది జైలు శిక్ష

సిరిసిల్ల క్రైం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): బాలికను వేధించిన (పోక్సో) కేసులో వేములవాడకు చెందిన దొమ్మాటి ఆనంద్, గొల్లపల్లి శశి, పబ్బ రాజేశ్, గౌరవేని నాగరాజు, సయ్యద్ సోహెల్, బొమ్మడి గణేశ్‌కు ఏడాది జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.1000 జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి (ఇన్‌చార్జి పోక్సో కోర్టు) ఎన్.ప్రేమలత సోమవారం తీర్పు వెల్లడించారని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. ఎస్పీ వివరాల ప్రకారం... 12 ఏప్రిల్ 2018న దొమ్మాటి ఆనంద్, గొల్లపల్లి శశి, పబ్బ రాజేశ్, గౌరవేని నాగరాజు, సయ్యద్ సోహెల్, బొమ్మడి గణేశ్ తనను వేధిస్తున్నారని వేములవాడకు చెందిన బాలిక స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేయగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రేమలత ఆరుగురు నిందితులకు శిక్ష విధించారని ఎస్పీ తెలిపారు.

రైతులంతా కదిలారు.. 'కల్వల' గండి పూడుస్తున్నారు


గండి పడి వృథాగా పోతున్న కల్వల ప్రాజెక్టు నీరు


ప్రాజెక్టుకు గండిని పూడ్చుతున్న రైతులు

శంకరపట్నం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వీణవంక మండలానికి వరప్రదాయమైన కల్వల ప్రాజెక్టుకు పడ్డ గండిని రైతులు సొంత ఖర్చులతో పూడ్చడానికి సోమవారం పూనుకున్నారు. శంకరపట్నం మండలంలోని కల్వల శివారులో ఉన్న ప్రాజెక్టుకు గత సంవత్సరం కురిసిన భారీ వర్షాలకు గండి పడింది. అప్పుడున్న బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తాత్కాలికంగా రింగు బండ్ నిర్మాణం చేసి రబీ సీజన్‌లో రైతులకు నీరందించారు. ఈ సంవత్సరం వర్షాకాలంలో కురిసిన వర్షాలకు మళ్లీ గండి పడింది. పారకమున్న రైతులు అధికారులను, ప్రజాప్రతినిధులను కలిసిన ఫలితం లేకుండాపోయింది. కల్వల ప్రాజెక్టు కింద పారకమున్న కల్వల, వీణవంక మండల రైతులు కొంత సొమ్ము జమ చేసి గండి మరమ్మతు చేసి రబీ సీజన్‌లో సాగు చేసుకోవాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కల్వల ప్రాజెక్టుకు మరమ్మతు చేసి రైతులకు రబీ సీజన్లో సాగునీరు అందించాల్సి ఉంది.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు విద్యార్థుల ఎంపిక


రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

సుల్తానాబాద్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలంలోని గట్టేపల్లి ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థినులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. పెద్దపల్లి జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో గట్టేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినిలు జి రమ్య, జోయానవాజ్, హఫ్సా ఐమాన్, గౌసియాలు తమ ప్రతిభతో రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థినిలను ప్రధానోపాధ్యాయురాలు వి అన్నపూర్ణ, పీడీ ప్రణయ్, ఉపాధ్యాయులు అభినందించారు.

మధ్యాహ్నం భోజనంపై నిర్లక్ష్యం వహించిన ఐదుగురు ఉపాధ్యాయులపై చర్యలు

జగిత్యాల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూల్స్‌లలో మధ్యాహ్న భోజనం నిర్వహణలో నిర్లక్ష్యంపై ఐదుగురు ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటూ కలెక్టర్ సత్యప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని ఇద్దరు ఉపాధ్యాయులను సస్పెండ్ చేయడంతో పాటు మరో ముగ్గురు ఉపాధ్యాయులకు మెమోలు జారీ చేశారు. కొడిమ్యాల మండలం చెప్యాల్ జడ్పీహెచ్ఎస్‌లో ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం మధ్యాహ్న భోజనం అమలు జరగడం లేదన్న కారణంతో ఫుడ్ ఇన్‌చార్జిగా ఉన్న స్కూల్ అసిస్టెంట్ వి వెంకటరమణ రావును సస్పెండ్ చేయడంతో పాటు ప్రధానోపాధ్యాయుడు వెంకటస్వామికి వివరణ కోరుతూ మెమో జారీ చేశారు. మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలో విద్యార్థులకు అందించే ఆహార పదార్థాలలో నాణ్యత లేదన్న కారణంతో పాఠశాల ఫుడ్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న ఉపాధ్యాయుడు సీహెచ్ కిషోర్‌ను సస్పెండ్ చేయడంతో పాటు పాఠశాల ప్రిన్సిపాల్ మాధవి లతను వివరణ అందజేయాలని ఆదేశిస్తూ మెమో జారీ చేశారు. కొడిమ్యాల మండలం చెప్యాల్ గ్రామంలో గల మండల పరిషత్ పాఠశాలలో భోజనం నాణ్యత సరిగా లేదన్న కారణంతో ఫుడ్ ఇన్‌చార్జిగా ఉన్న ఉపాధ్యాయుడు ఎం ప్రవీణ్ కుమార్‌కు మెమో జారీ చేశారు.

రాజీవ్ రహదారిపై బొగ్గు లారీ బోల్తా



రోడ్డుపై బొగ్గు

సుల్తానాబాద్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): బొగ్గు లోడ్‌తో వెలుతున్న ఓ లారీ అదుపు తప్పి రాజీవ్ రహదారిపై ఆదివారం అర్థరాత్రి బోల్తా పడింది. దాంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. సంఘటనలో డ్రైవర్ తదితరులకు స్వల్ప గాయాలయ్యాయి. మహారాష్ట్ర నుంచి బొగ్గు లోడ్‌తో వస్తున్న లారీ సుల్తానాబాద్ మండలంలోని కాట్నపల్లి వద్ద గల మూల మలుపు వద్ద అదుపు తప్పి డివైడర్ ఎక్కి రోడ్డుపై బోల్తా పడింది. దీంతో లారీలో ఉన్న బొగ్గంతా రోడ్డుపై పడిపోగా రాకపోకలకు ఆటంకం కలిగింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని బొగ్గును వేరే లారీ లో లోడ్ చేయించి రాకపోకలను పునరుద్ధరించారు.

మద్యం మత్తులో భార్య, అత్తపై దాడి

వేములవాడ రూరల్, నవంబరు25,(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో భార్య, అత్తపై అల్లుడు రోకలితో దాడి చేసిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మర్రిపల్లి గ్రామానికి చెందిన మొగిలి రాముకు కథలాపూర్ మండలం గంభీపూర్ గ్రామానికి చెందిన జలతో వివాహం జరిగింది. వీరికి మూడు సంవత్సరాల కూతురు ఉంది. మద్యానికి బానిసైన రాము తరుచూ భార్యతో గొడవపడుతూ ఉండేవాడు. దీంతో ఆమె కొన్ని నెలలనుండి తన తల్లిగారి ఇంట్లో ఉండేది. 15 రోజుల క్రితం కథలాపూర్ పోలీస్‌స్టేషన్లో కౌన్సిలింగ్ నిర్వహించడంతో పెద్దల సమక్షంలో తిరిగి అత్తగారి ఇంటికి వచ్చింది. ఈ క్రమంలో తన కూతురును చూడడానికి లచ్చవ్వ ఆదివారం మర్రిపల్లికి వచ్చింది. అప్పటికే మద్యం మత్తులో ఉన్న రాము తన భార్యతోపాటు అత్తపై రోకలిబండతో దాడి చేసాడు. దాడిలో గాయపడ్డ ఇద్దరిని స్థానికులు కరీంనగర్‌కు తరలించారు. రూరల్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

భార్య కాపురానికి రావడం లేదని బలవన్మరణం


రాము (ఫైల్)

కథలాపూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చింతకుంటకు చెందిన అందె రాము (32) అనే వ్యక్తి ఒంటిపై పెట్రోల్ పోసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఎస్సై నవీన్ కథనం ప్రకారం..రాముకు గత ఏడాది కిందట ఇబ్రహీంపట్నంకు చెందిన ఓ యువతితో వివాహమైంది. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య మనస్పర్థలు చోటుచేసుకోవడంతో మూడు మాసాల కిందట పుట్టింటికి వెళ్లింది. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన రాము గ్రామ సమీపంలోని వీర్ల గుట్ట వద్ద ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. తీవ్ర గాయాలతో కొట్టుమిట్టాడుతూ కేకలు వేయడాన్ని అటువైపు వెళ్తున్న వ్యక్తులు గమనించారు. చికిత్స నిమిత్తం కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం జగిత్యాలకు తరలిస్తున్న క్రమంలో మృతి చెందాడు.

కలెక్టరేట్ ముట్టడికి యత్నించిన మాజీ సర్పంచులు

- అడ్డుకుని అరెస్టు చేసిన పోలీసులు

సుభాష్‌నగర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరుతూ మాజీ సర్పంచులు సోమవారం కరీంనగర్ కలెక్టరేట్ ముట్టడికి యత్నించారు. పోలీసులు వారిని అడ్డుకుని అరెస్టు చేశారు. జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల నుంచి వచ్చే వారిని కరీంనగర్ శివారు ప్రాంతాల్లోనే అరెస్టు చేశారు. విషయం తెలుసుకున్న మాజీ సర్పంచులు దశల వారీగా అక్కడికి చేరుకున్నారు. అప్రమత్తమైన పోలీసులు వచ్చిన వారిని వచ్చినట్లుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్‌లు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు రూ.700 కోట్లకు వరకు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత బకాయిల కోసం తిరుగుతున్నామని, ముఖ్యమంత్రి దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లామన్నారు. అయినా తమ బిల్లులు విడుదల చేయడం లేదన్నారు. అప్పులు చేసి, బంగారం అమ్మి అభివృద్ధి పనులు చేశామని తెలిపారు. ఇప్పటి వరకు తమకు రావలసిన బిల్లులు విడుదల చేయలేదన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, అప్పుల పాలయ్యామని వాపోయారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తమ బకాయిలను చెల్లించాలని కోరారు.



కలెక్టరేట్ ముట్టడికి వచ్చిన మాజీ సర్పంచ్‌లను అడ్డుకుంటున్న పోలీసులు

నకిలీ పత్రాలతో ఇల్లు కబ్జా

- ఉన్నతాధికారులను ఆశ్రయించిన బాధితుడు
- పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసిన పంచాయతీ కార్యదర్శి

గొల్లపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి మండలంలో గ్రామ పంచాయతీ కార్యాలయం ఫోర్జరీ సంతకాలకు నిలయంగా మారిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఫోర్జరీ సంతకాలతో నకిలీ ధ్రువీకరణ పత్రాలు సృష్టించిన ఓ మహిళ ఏకంగా ఒక ఇంటినే కబ్జా చేయడమే కాకుండా తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో రికార్డుల్లో తన భర్త పేరును ఇంటి యజమానిగా రికార్డుల్లోకి నమోదు చేసుకుంది.. బాధిత వ్యక్తి ఉన్నతాధికారులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అధికారులు కొద్ది రోజుల క్రితం విచారణ జరపడంతో అసలు విషయం వెలుగుచూసింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సదరు బాధ్యులపై పోలీసు స్టేషనల్ ఫిర్యాదు చేయాలని ఇచ్చిన ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీ కార్యదర్శి గొల్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

వివరాల్లోకెళితే.. గొల్లపల్లి మండల కేంద్రంలోని ఇంటి నెం 5-88 అనే ఇల్లు ఇటీవలి వరకు మ్యాదరి ఆశయ్య పేరిట ఉండేది. ఆశయ్యకు ముగ్గురు కొడుకులున్నారు. ఒక కొడుక్కి ముంబైలో ఉన్న ఇంటితో పాటు ఉద్యోగం అప్పగించారు. మిగితా ఇద్దరికి గొల్లపల్లిలో ఉన్న సదరు ఇల్లు సమానంగా పంచుకోవాలని తల్లిదండ్రులు తీర్మానించారు. ఆశయ్య 1986లో మృతి చెందగా అప్పటినుంచి 2024 వరకు చిన్న కొడుకైన ఏసుదాసు ఇంటి బిల్లు చెల్లిస్తూ వస్తున్నాడు. ఈ క్రమంలో పెద్ద కొడుకైన స్వామిదాసు ఆశయ్యకు తాను ఒక్కడినే కొడుకునని రెవెన్యూ కార్యాలయంలో ఫోర్జరీ సంతకాలతో నకిలీ పత్రాలు సృష్టించి మల్యాల సబ్-రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఇంటిని తన పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. ఇటీవల స్వామిదాసు అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ క్రమంలో చిన్న కొడుకైన ఏసుదాసు ఉపాధి నిమిత్తం ముంబై వెళ్లి కొద్ది రోజుల క్రితం స్వగ్రామానికి తిరిగిరాగా తన కుటుంబంతో కలిసి తన ఇంట్లోకి వెళ్లేందుకు ప్రయత్నించాడు. దీంతో స్వామిదాసు భార్య మ్యాదరి లక్ష్మీ ఈ ఇల్లు తనదని, మీరెలా ఉంటారంటూ ఏసుదాసును ఇంట్లో నుంచి వెళ్లగొట్టినట్లు బాధితుడు కన్నీళ్లపర్యంతమయ్యాడు. తన మీద, తన భార్య పిల్లల మీద దాడి చేసినట్లు బాధితుడు పేర్కొన్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు విచారణ జరిపిన ఎంపీవో సురేష్‌రెడ్డి నకిలీ ధ్రువ పత్రాలతో ఇంటిని రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు గుర్తించారు. దీనిపై ఒక నివేదికను తయారు చేసి జిల్లాస్థాయి అధికారికి పంపించగా రికార్డుల్లో నుంచి స్వామిదాసు పేరును తొలగించి యథాతదంగా నమోదు చేయాలని, సహకరించిన సిబ్బందిపై, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఉత్తర్వులు ఇచ్చారు. ఈ మేరకు గొల్లపల్లి పంచాయతీ కార్యదర్శి మధుసూదన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై చిర్ర సతీష్ కుమార్ తెలిపారు.

పంటలకు కనీస మద్దతు ధర చట్టం చేయాలి

● హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ చంద్రకుమార్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ చంద్రకుమార్

సుభాష్‌నగర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర చట్టం చేయాలని హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. సోమవారం కరీంనగర్‌లో తెలంగాణ రైతు సంక్షేమ సమితి వార్షికోత్సవ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కనీస మద్దతు ధర చెల్లించినపుడే రైతుకు న్యాయం జరుగుతుందన్నారు. 50 సంవత్సరాలు నిండిన రైతులు, కౌలు రైతులు, రైతు కూలీలకు నెలకు రూ.15 వేల పెన్షన్ ఇవ్వాలన్నారు. ప్రతి రైతుకు బీమాతో పాటు పంట బీమా కల్పించాలని, రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని డిమాండ్ చేశారు. నకిలీ విత్తనాలను ఉత్పత్తి చేసే సంస్థలపై కఠిన చర్యలు తీసుకొని వాటి వల్ల నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇప్పించాలని కోరారు. సేంద్రియ వ్యవసాయానికి ప్రభుత్వం అన్ని రకాల ప్రోత్సాహకాలు ఇవ్వాలన్నారు. ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు ఇస్తున్న పరిహారాన్ని రెట్టింపు చేయాలని, ఆ పరిహారాన్ని సంబంధిత కుటుంబానికి 30 రోజుల్లో అందించాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులకు అందించే రుణ సాయం, రైతు బంధు, రుణమాఫీ, సబ్సిడీలు కౌలు రైతులకు కూడా ఇవ్వాలని కోరారు. గిడ్డంకులు ఏర్పాటు చేసి రైతు పంటలు నిల్వచేయడానికి అవకాశం కల్పించాలన్నారు. అకాల వర్షాల వల్ల తడిసిన ధాన్యం, పత్తిని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పాడి పశువులకు బీమా కల్పించాలని, ఆదివాసీల పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని కోరారు. పరిశ్రమల కోసం ప్రభుత్వం భూసేకరణ చేయవలసివస్తే, భూమికి బదులుగా మరోచోట వ్యవసాయభూమి ఇవ్వాలని చంద్రకుమార్ డిమాండ్ చేశారు. డిసెంబరు 1న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే తెలంగాణ రైతు సంక్షేమ సమితి ఐదో వార్షికోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వర్ద వెంకటరెడ్డి, సుతారి లచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

రామగుండం రైల్వేస్టేషన్‌లో పోలీసుల తనిఖీలు



దానాపూర్ ఎక్స్‌ప్రెస్‌లో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేస్తున్న పోలీసులు

అంతర్గాం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రామగుండం రైల్వేస్టేషన్‌లో గోదావరిఖని ఏసీపీ మడత రమేష్ అధ్వర్యంలో సివిల్, ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ, స్పెషల్ పార్టీ పోలీసులు సంయుక్తంగా సోమవారం తనిఖీలు నిర్వహించారు. రైల్వే స్టేషన్‌లోని ప్లాట్‌ఫామ్‌లతో పాటు దానాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలులో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పదంగా కనిపించిన ప్రయాణికుల బ్యాగులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ రాష్ట్రాన్ని డ్రగ్స్ రహిత రాష్ట్రంగా చేసేందుకు పోలీస్ శాఖ అధ్వర్యంలో మాదకద్రవ్యాల నిర్మూలన కోసం పటిష్ఠమైన చర్యలు చేపడుతున్నట్టు పేర్కొన్నారు. గంజాయి, మాదక ద్రవ్యాల వినియోగంతో యువత నిర్వీర్యం అయ్యే ప్రమాదం ఉందని గంజాయి రవాణాను అరికట్టేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐలు ప్రవీణ్ కుమార్, ఇంద్రసేనారెడ్డి, బుర్ర సురేష్‌గౌడ్, ఎస్‌ఐలు వెంకట స్వామి, సంధ్యారాణి, జీఆర్‌పీ ఇన్‌చార్జి తిరుపతి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పర్యాటక శోభకు శ్రీకారం



ఎల్. మడుగు పక్కన ఉన్న కొండ

- గోదావరి నదిలో రెండు గుట్టల మధ్య సహజ సిద్ధంగా వెలసిన ఎల్. మడుగు
- పర్యాటక కేంద్రంగా అభివృద్ధికి సన్నాహాలు
- ఎల్. మడుగు వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి నేడు శంకుస్థాపన

మంథని, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గలగల పారే గోదావరి నది ప్రవాహ పరుగులకు అడ్డుకట్టలా రెండు గుంటల మధ్య సహజ సిద్ధంగా ఏర్పడిన ఎల్. మడుగు (మొసళ్ల సంరక్షణ కేంద్రం) ప్రకృతి అందాలకు ప్రభుత్వం పర్యాటక శోభను తీసుకురావటానికి శ్రీకారం చుట్టింది. విలువైన మత్స్య, వన సంపదలకు నెలవుగా ప్రకృతి ప్రేమికులను ఇట్టే ఆకర్షించే ఎల్. మడుగును పర్యాటక కేంద్రగా అభివృద్ధి చేయటానికి రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ మేరకు అనేక అభివృద్ధి పనులు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపారు. ఇందులో భాగంగా ప్రభుత్వం నుంచి ఇటీవల మంజూరైన రూ. 7 కోట్ల నిధులతో మంథని-కాటారం ప్రధాన రహదారి నుంచి వయా ఖానాపూర్ మీదుగా ఎల్. మడుగు ఉన్న గోదావరినది వరకు డబుల్ రోడ్డు నిర్మాణ పనులకు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మంగళ వారం శంకుస్థాపన చేయనున్నారు. తొలుత డబుల్ రోడ్డు పనులు పూర్తిచేసిన తర్వాత గోదావనదిలో, తీరంలో పర్యాటకులు ప్రకృతి ఒడిలో సేద తీరేలా పలు అభివృద్ధి పనులు, ఇతర వసతి సౌకర్యాలను ఏర్పాటు చేయనున్నారు.

ఇటీవల రాష్ట్ర టూరిజం ఎండీ ప్రకాష్‌రెడ్డి సందర్శించి చేపట్టాల్సిన పనులు గురించి ఆరా తీశారు. ఈ మేరకు బోటింగ్, కాటేజీలు, ఇతర వసతులు గురించి ప్రతిపాదనలు తయారు చేశారు. ప్రకృతి సోయగాలకు నిలువెత్తు నిదర్శనంగా విరాజిల్లుతున్న ఎల్. మడుగు ప్రత్యేకత ఇప్పుడిప్పుడే ప్రాచుర్యంలోకి వస్తోంది. అంతరించిపోతున్న మొసళ్ల పెంపక కేంద్రంగా, మత్స్య సంపద బాండాగారంగా ఎల్. మడుగు విరాజిల్లుతోంది. ఎల్. మడుగు ఇటు ప్రకృతి సోయగాలు పర్యాటక కేంద్రంగా ఆహ్లాదాన్ని పంచే జలాశయంగా కీర్తి గడించే అవకాశం ఉంది.

రెండు గట్టల మధ్య ఏర్పడ్డ మడుగు..

మంథని నుంచి తూర్పు వైపు మూడు కిలో మీటర్ల దూరంలో ఖానాపూర్ గ్రామం శివారులో ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల సరిహద్దుగా ఉన్న రెండు గుట్టలు అతి దగ్గరగా ఉండి గోదావరి నది ప్రవాహానికి అడ్డు తగలడంతో సహజ సిద్ధంగా మడుగు ఏర్పడింది. దాదాపు 50 మీటర్లకు పైగా మడుగు లోతుగా ఉన్నట్లు అంచనా. దీంతో ఎంతటి వర్షాభావ పరిస్థితులో నైనా ఎల్. మడుగు నీరు పుష్కలంగా నిల్వ ఉంటుంది.

అడవులు, గుట్టలతో ఎల్. మడుగు అందాలు..

నిత్యం నిండు కుండలా ఉండే మడుగుకు ఇరువైపులా ఉన్న గుట్టలపై పచ్చదనం పరుచుకునేలా చెట్లు ఉన్నాయి. ఇవతలి వైపు, అవతలి వైపు ఉన్న ఎత్తైన గుట్టలు కనువిందు చేస్తాయి. గుట్టలపై నుంచి కిందికి చూస్తే జలాశయాన్ని తలపించే ఎల్. మడుగు, పక్కలకు చూస్తే కింద నేలపై పచ్చని తివాచి పర్చినట్లు కన్పించే పొలాలు, పైన భారీ వృక్ష సంపద దృశాలు అందరినీ ఆకట్టుకుంటాయి.

ఎల్. మడుగు చరిత్ర..

స్థానికంగా ప్రాచుర్యంలో ఉన్న పురాతన కథనం ప్రకారం.. ఎల్. మడుగు ఇవతలి వైపు గ్రామానికి చెందిన ఓ వివాహిత అవతలి వైపు గుట్ట సమీప ప్రాంతంలో ఉన్న వ్యక్తితో ఉన్న పరిచయం కారణంగా నిత్యం ఎండుకుండను పొట్ట క్రింద పెట్టుకొని ఈదుకుంటూ మడుగు దాటి వెళ్ళి తిరిగి వచ్చేది. సదరు వివాహిత ప్రవర్తనతో విసుగు చెందిన భర్త కాల్చని కుండను ఆమె కుండ తీసుకొని వెళ్లే స్థానంలో పెట్టడంతో గమనించకుండా అదే కుండను తీసుకొని ఈదుకుంటూ మడుగు దాటుతుండగా మార్గ మధ్యలో కుండ పూర్తిగా విచ్చుకు పోయి వివాహిత మడుగులో పడి మృతి చెందడంతో ఎల్. మడుగుగా ఈ పేరు వచ్చినట్లు స్థానికులు చెప్పుకుంటారు.

మొసళ్ల పెంపక కేంద్రం..

గోదావరినదికి అవతలి వైపు ఉన్న మంచిర్యాల జిల్లా, మంచిర్యాల ఫారెస్టు రేంజ్ పరిధిలోని శివ్వారం వన్యప్రాణి అభయారణ్య కేంద్రంగా ఉన్న ఎల్. మడగులో అటవీశాఖ వారు మొసళ్ళ సంరక్షణ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం మడుగులో ఉన్న మొసళ్లను సంరక్షించడంతో పాటు అవి పెట్టే గుడ్లు పిల్లలు అయ్యేంత వరకు రక్షించి నదిలో సురక్షితంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. మడుగులోని మొసళ్ల ఏకాంతానికి భంగం కలగకుండా, ఇతరుల నుంచి వాటికి ముప్పు వాటిల్లకుండా చర్యలు తీసుకుంటున్నారు. దాదాపు 60 నుంచి 70వరకు మొసళ్లు మడుగులో ఉన్నట్లు, వీటిలో కొన్ని 50 సంవత్సరాలకు పైగా వయస్సున్నట్లుగా అంచనా. ప్రశాంతంగా ఉండే సమయాల్లో ఉదయం, సాయంత్రం నది తీరంలో ఉండే రాతి బండలు, ఒడ్లపైకి మొసళ్లు వచ్చి సేద తీరుతాయి. ఈ సమయంలో వీటిని సహజ సిద్ధంగా చూడటం వీనుల విందే.

విలువైన మత్స్య సంపద..

విలువైన మత్స్య సంపదకు నిలయంగా ఉంది. బొమ్మెలు, రొయ్యలు, కొర్ర మట్టలు, రావులు, బుడ్డ పరకలు, అలుగులు, జెల్లలు లాంటి వివిధ రకాల చేపలు దొరుకుతాయి. గోదావరి నది మత్స్య సంపదకు మంచి రుచి ఉంటుండంతో ఇక్కడ కొంత మంది చేపలు మంథని, గోదావరిఖని, సెంటినరీకాలనీ, భూపాలపల్లి, కాటారం, అవతలి వైపు మంచిర్యాల, శ్రీరాంపూర్ ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

పురాతన ఆలయం, చారిత్రక కట్టడం..

గోదావరి నదిలోని ఎల్. మడుగు అవతలి వైపు మంచిర్యాల జిల్లా శివారులో ఉన్న గుట్టపై పురాతన ఆలయం, చారిత్రక కట్టడాలను చూస్తే కనువిందు చేస్తాయి. అనాధిగా జన సంచారం లేక ప్రకృతి పరంగా, ధ్వంసం కావడంతో పాటు గుప్త నిధుల కోసం దుండగులు ధ్వంసం చేసిన శిథిలమైన శివాలయం, ఇతర కట్టడాలు నేటికీ దర్శనమిస్తున్నాయి. కాకతీయ కళా వైభవానికి అద్దం పట్టేలా గుట్టలోని ఆలయాన్ని, ఇతర నిర్మాణాలను మలిచిన తీరు అందరినీ ఆకర్షిస్తున్నాయి.



గోదావరినదిలో ఎల్ మడుగు ప్రాంతం

మ్యూచువల్ ఫండ్స్ పేరుతో రూ.70 వేలకు టోకరా

కరీంనగర్ క్రైం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): క్రెడిట్ కార్డుతో మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడి పెడితే మంచి లాభాలు వస్తాయని నమ్మించి మోసానికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు కరీంనగర్ టూటౌన్ పోలీసు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరానికి చెందిన మొగిలి లక్ష్మయ్య అనే వ్యక్తికి ఈ నెల 19న ఒక బ్యాంకు నుంచి మనూష అనే మహిళ ఫోన్ చేసి మొదట లోన్ కావాలా అని అడిగింది. తనకు అవసరం లేదని లక్ష్మయ్య అనడంతో క్రెడిట్ కార్డు ఉంటే మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడి పెడితే రెండు లక్షల రూపాయలు లాభం వస్తుందని చెప్పి క్రెడిట్ కార్డు వివరాలు తీసుకుంది. అతని క్రెడిట్ కార్డు నుంచి 66,998 రూపాయలు కట్ అయ్యాయి. డబ్బులు ఎందుకు కట్ అయ్యాయని అడిగితే మూడు రోజుల్లో జమ అవుతాయని చెప్పింది. కానీ డబ్బులు జమ కాకపోవడంతో మోసపోయానని మొగిలి లక్ష్మయ్య గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

కాల్వశ్రీరాంపూర్, నవంబర్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెగడపల్లికి చెందిన కుమార్ (40) అనే వ్యక్తి పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నం చేయగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కుమార్ కొన్నిరోజులుగా గుండె సమస్యతో బాధపడుతున్నాడు. తన ఆరోగ్యం బాగుచేయించుకోవడం కోసం అప్పులు చేశాడు. అప్పులు తీరక, ఆరోగ్యం బాగుపడకపోవడంతో తీవ్ర మనస్తాపం చెంది ఈ నెల 20వ తేదీన తన ఇంటిలో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి ప్రథమచికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృత్యువాతపడ్డాడు. మృతుడికి భార్య ఒక కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు.

జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక

వీణవంక, నవంబరు 25(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఘన్ముక్ల గ్రామంలోని ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న హరీష్ అనే విద్యార్థి జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీడీ షాబీర్‌పాషా సోమవారం తెలిపారు. ఈ మేరకు సోమవారం విద్యార్థిని ప్రిన్సిపాల్ మోయిజ్ బేగ్, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ మధు జాన్సన్‌లు అభినందించారు.

ఆలయాల్లో కార్తీక సందడి



గోదావరిలో దీపాలు వదులుతున్న భక్తులు



గోదావరి హారతి



స్వామివారి దర్శనం కోసం క్యూలైన్‌లో భక్తులు

- భక్తజన సంద్రంగా రాజన్న క్షేత్రం
- ధర్మపురి క్షేత్రంలో ఘనంగా పూజలు
- గోదావరిలో దీపాలు వదిలిన మహిళలు

వేములవాడ కల్చరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజన్న క్షేత్రం సోమవారం భక్తజన సంద్రంగా మారింది. కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు మహారాష్ట్ర, ఇతర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తులు ముందుగా రాజరాజేశ్వర స్వామికి ప్రీతిపాత్రమైన కోడె మొక్కు చెల్లించుకున్నారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. కోడెమొక్కు చెల్లించుకునేందుకు సుమారు ఐదు గంట లపాటు భక్తులు క్యూలైన్‌లో నిరీక్షించారు. ధర్మదర్శనం క్యూలైన్‌లో స్వామి వారి దర్శనానికి వెళ్లిన భక్తులు మూడు నుంచి నాలుగు గంటల సమయం పట్టగా శీఘ్రదర్శనం క్యూలైన్‌లో వెళ్లిన భక్తులకు రెండు గంటల సమయం పట్టింది. సుమారు లక్ష మంది వరకు భక్తులు స్వామివారిని దర్శించు కున్నట్లు ఈవో వినోద్‌రెడ్డి తెలిపారు. కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో భక్తులు రాజన్న ఆలయానికి పోటెత్తారు. వేములవాడకు భారీగా తరలివచ్చిన భక్తులు స్వామివారి దర్శనం అనంతరం ఆలయ ప్రాంగణంలో కుటుంబ సభ్యులతో కలిసి కార్తీక దీపాలను వెలిగించారు.

బద్దిపోచమ్మ ఆలయంలో రద్దీ

రాజన్న ఆలయానికి ఆదివారం వచ్చిన భక్తులు సోమ వారం ఉదయం రాజన్నను దర్శించుకొని అనంతరం మట్టి పాత్రల్లో నైవేద్యాన్ని వండుకొని డప్పుచప్పుళ్లతో శివసత్తుల నృత్యాలతో ఊరేగింపుగా బద్దిపోచమ్మ అమ్మవారి ఆలయా నికి చేరుకున్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు రావడంతో గంట పాటు క్యూలైన్‌లో నెత్తిన బోనాలతో భక్తులు బారులు దీరారు. ఆలయంలోకి చేరుకున్న భక్తులు అమ్మవారికి నైవే ద్యాన్ని సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

ధర్మపురి, (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో ఆఖరి సోమవారం కార్తీక సందడి నెలకొంది. కార్తీక మాసం సందర్భంగా భారీగా భక్తులు తరలి వచ్చారు. లక్ష్మీ నృ సింహస్వామి, అనుబంధ రామలింగేశ్వ స్వామి, అక్కపెల్లి రాజ రాజేశ్వర స్వామి ఆలయంలో భక్తుల రద్దీ పెరిగింది. గోదావరి నదిలో భక్తులు కార్తీక స్నానాలు ఆచరించారు. భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. స్వామి వారలకు ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ, వేద పారాయణ దారు పాలెపు ప్రవీణ్ కుమార్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య అర్చకులు, పూజలు, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు.



వేములవాడలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

24వ రోజు గోదావరి హారతి

కార్తీక మాసం పురస్కరించుకుని ధర్మపురి వద్ద గోదావరి హారతి 24వ రోజు సోమవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు, అర్చకులు, సిబ్బంది, భక్తులు, గోదా వరి నది వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఆలయ వేదపండితులు నదీ మాతకు ప్రత్యేక పూజలు చేసి హారతి ఇచ్చి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, పాల్గొన్నారు.



భక్తులతో కిక్కిరిసిన వేములవాడ రాజన్న ఆలయ ప్రాంగణం

సేంద్రియ పద్ధతిలో తైవాన్ జామ సాగు

లాభాలు ఆర్జిస్తున్న యువరైతు



మల్లేశం సాగు చేస్తున్న తోటలోని తైవాన్ జామ కాయలు

గంభీరావుపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సేంద్రియ పద్ధతిలో తైవాన్ జామ సాగు చేస్తూ లాభాలు ఆర్జిస్తున్నాడు గంభీరావుపేట మండలం నర్మాల గ్రామానికి చెందిన బొంగు మల్లేశం అనే యువ రైతు. మల్లేశం తనకున్న రెండెకరాల్లో వరి సాగు చేసేవాడు. సంప్రదాయ పంటలు కాకుండా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేపట్టాలని ఆలోచిం చాడు. అధిక సాంద్రత పద్ధతిలో జామ తోటను సాగు చేయాలని నిర్ణ యించుకున్నాడు. రెండేళ్ల కిందట ఖమ్మం జిల్లా అశ్వరావుపేట నుంచి 700 తైవాన్ జామ మొక్కలను 30 రూపాయల చొప్పున కొనుగోలు చేసి తెచ్చాడు. ఎకరం భూమిలో మొక్కల వరుస మధ్య మీటరు దూరం ఉండేలా నాటాడు.

రసాయన ఎరువులు క్రిమిసంహారక మందులు వాడకుండా జీవామృతం కోళ్ల ఎరువు, పశువుల పేడ, వేప పిండి, వేపానునూనెతో పూర్తిగా సేంద్రియ పద్ధతిలో తైవాన్ జామ సాగు చేస్తున్నాడు. పొలంలో కలుపు లేకుండా ఎప్పటికప్పుడు తొలగిస్తున్నాడు. కోతులు, అడవి పందుల బెడద రక్షించుకునేందుకు చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశాడు. జామ మొక్కలు నాటిన నాలుగు నెలలకు కాతకు వచ్చింది. ఏడాదికి మూడు సార్లు పంట చేతికొస్తుండగా క్రాప్‌కు పది క్వింటాళ్ల దిగుబడి సాధిసున్నట్లు, కిలో జామ రూ.60 చొప్పున విక్రయిస్తున్నట్లు రైతు పేర్కొంటున్నాడు.

మంచి లాభాలు: బొంగు మల్లేశం, యువరైతు, నర్మాల



తైవాన్ జామకు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంది. జామ కాయల అమ్మకాలతో లాభాలు వస్తున్నాయి. ఎకరానికి పంటకు సగటున 10 క్వింటాళ్ల జామ కాయలు పండిస్తున్నా. మార్కెట్‌లో కిలో జామకు ధర 60 రూపాయలు పలుకుతోంది. పెట్టుబడి పోను పంటకు రూ.50 వేల ఆదాయం వస్తోంది.

జేఎన్టీయూలో జాతీయ స్థాయి వర్క్‌షాప్

రామగిరి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఈ నెల 29, 30 తేదీల్లో రెండు రోజుల పాటు సీఎస్‌ఈ, సీఎస్‌ఎం విద్యార్థులతో జాతీయస్థాయిలో నిర్వహించే వర్క్‌షాప్ బ్రోచర్‌ను ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్‌రెడ్డి సోమవారం ఆవిష్కరించారు. మిషన్ లర్నింగ్ అండ్ బిగ్ డేటాపై జరిగే వర్క్‌షాప్‌లో పాల్గొనే విద్యార్థులు రూ.400 రిజిస్ట్రేషన్ చెల్లిస్తే భోజనంతో పాటు వసతి సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. రిజిస్ట్రేషన్ కోసం 7981686589, 8688368187 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఆఫీసు సూపరింటెంటెండ్ రవికుమార్, కన్వీనర్ తిరుపతి, ఫ్యాకల్టీ ఓ-ఆర్డినేటర్ నరహరి, శ్రీనివాస్‌రావు, వంశీకృష్ణ, శ్రీధర్, స్టూడెంట్ కో-ఆర్డినేటర్ సందీప్‌కుమార్, అంకిత, దేవి శరణ్, సహస్ర తేజ, విద్యార్థులు పాల్గొన్నారు.



వర్క్‌షాప్ బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీధర్‌రెడ్డి, సిబ్బంది

న్యూస్ బాక్స్

నేడు సబ్బితం రానున్న మంత్రులు

పెద్దపల్లి రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి మండలంలోని సబ్బితం గ్రామానికి రాష్ట్ర దేవాదాయ, ధర్మదాయ శాఖ, పర్యావరణ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మంగళవారం రానున్నట్లు కరీంనగర్ జిల్లా దేవాదాయ ధర్మదాయ శాఖ సహాయ కమిషనర్ సుప్రియ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని సీతారామచంద్రస్వామి ఆలయ అభివృద్ధికి సీజీఎఫ్ నిధులు 50 లక్షలతో నిర్వహించనున్న పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్‌రావు, ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు హాజరు కానున్నట్లు తెలిపారు.

గ్యార్మీ షరీఫ్ వేడుకలు

పెద్దపల్లి రూరల్ , నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాఘవపూర్ మీర్ షా వలీ దర్గా వద్ద మైనార్టీ వ్యాన్ ఓనర్ల ఆధ్వర్యంలో గ్యార్మీ షరీఫ్ (జండా పండుగ) వేడుకలు ఘనంగా నిర్వహించారు. మైనార్టీ వ్యాన్ ఓనర్లు, వ్యాన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాఘవపూర్ దర్గా వరకు జండాతో ర్యాలీగా వెళ్లి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో సయ్యద్ మస్రత్, గోపగాని సారయ్యగౌడ్, వ్యాన్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంటీ అరిఫ్‌అలీ, అబ్దుల్ బారీ, తిరుపతి, ఓనర్లు, డ్రైవర్లు పాల్గొన్నారు.

వేతనాలు మంజూరు చేయాలి

ఎలిగేడు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు వేతనాలను మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్‌కు సోమవారం వినతిపత్రం అందిజేసినట్లు తెలంగాణ ప్రభుత్వ పాఠశాల కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి నారాయణ పేర్కొన్నారు. మూడు నెలలుగా ప్రభుత్వం వేతనాలను అందించకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నట్లు ఆయన తెలిపారు. పేదవర్గాలకు చెందిన కార్మికులు పాఠశాలలపై ఆధారపడి జీవిస్తున్నారని, వారి ఇబ్బందులను గమనించి వెంటనే వేతనాలు మంజూరు చేసి ఆదుకోవాలని కలెక్టర్‌ను కోరారు. ఆయన వెంట జిల్లా ఉపాధ్యక్షుడు లింగయ్య, శ్రీధర్ పాల్గొన్నారు.

ప్రజాపాలనపై కళాజాతా

కాల్వశ్రీరాంపూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాల్వశ్రీరాంపూర్, గంగారం, పెగడపల్లి, ఊషన్నపల్లి గ్రామాల్లో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృందం ఆరు గ్యారంటీలు, ప్రజాసంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై సోమవారం ఆటపాటలతో అవగాహన కల్పించారు. గడపగడపకు అందుతున్న అభివృద్ధి ఫలాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కళాకారులు ఇల్లందుల మల్లేశంగౌడ్, స్నేహలత, బుర్ర శంకర్‌గౌడ్, సలేంద్ర రాజన్న, వెంకటస్వామి, సాయిల శ్రీనివాస్, స్వప్న, రేణుక, సరిత, శ్రీవల్లి పాల్గొన్నారు.

పల్లెల్లో నిరుపయోగంగా క్రీడా ప్రాంగణాలు



గుడిపెల్లిలో నిరుపయోగంగా ఉన్న క్రీడా ప్రాంగణం

పాలకుర్తి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ పల్లె ప్రాంతాల్లోని యువతను, క్రీడాకారులను ప్రోత్సహిస్తూ.. వారిలోని ప్రతిభ నైపుణ్యాలను వెలికి తీసి క్రీడాల్లో రాణించేందుకు వీలుగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం పల్లెల్లో క్రీడా మైదానాలను ఏర్పాటు చేసింది. నిర్వహణ లోపంతో అవి నిరుపయోగంగా మారుతున్నాయి. పాలకుర్తి మండల వ్యాప్తంగా 19 గ్రామపంచాయతీల్లో ఒక్కొక్క క్రీడా ప్రాంగణానికి 72 వేల రూపాయల చొప్పున మొత్తం మూడు లక్షల 68 వేల రూపాయలతో తెలంగాణ క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశారు. కనీస సౌకర్యాలు, శిక్షణ ఇచ్చేందుకు శిక్షకుల ఏర్పాటు వంటివి లేకపోవడంతో క్రీడా మైదానాలు నిరుపయోగంగా మారాయి. కొన్ని క్రీడా మైదానాల్లో రెండు ఇనుప పోల్స్ ఎక్సర్ సైజ్ బోర్డులను పాతి వదిలేశారు. అక్కడ ఆటలు ఆడే పరిస్థితి లేదు. మండలంలోని చాలా ప్రాంగణాలు చెట్లు, పిచ్చి మొక్కలు విరివిగా పెరిగి అధ్వానంగా మారాయి. క్రీడా మైదానాల నిర్వాహణను అటు ప్రభుత్వ అధికారులు, ఇటు పాలకులు పట్టించుకోకపోవడంతో అలంకారప్రాయంగా మారాయి. క్రీడా మైదానాలకు కేటాయించిన ప్రజాధనం వృధా అయ్యిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

● ఇప్పటికీ రాని బిల్లులు..

మండలంలో నిర్మించిన పలు తెలంగాణ క్రీడా ప్రాంగాణాలకు ఇప్పటివరకు పూర్తిస్థాయిలో బిల్లులు రాలేదని పలువురు గుత్తేదారులు తెలిపారు. అప్పటి అధికారులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతీ గ్రామంలో తెలంగాణ క్రీడా ప్రాంగణం నిర్మించాలని పలువురు ప్రజాప్రతినిధుల మీద ఒత్తడి తీసుకువచ్చారు. దీంతో పలువురు అందిన చోటల్లా అప్పులు తెచ్చి క్రీడాప్రాంగణాలను ఏర్పాటు చేశారు. ఏళ్ల గడుస్తున్నా బిల్లులు రాకపోవడంతో గుత్తెదారులు నేటికీ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నామని పలువురు గుత్తెదారులు వాపోతున్నారు.

● వినియోగించుకునేలా చర్యలు

- ఎంపీడీవో పొల్సాని శశికళ

క్రీడా ప్రాంగణాలకు సంబంధించి గ్రామాలకు క్రీడా సామగ్రితో కూడిన కిట్లను అందజేశాం. కొన్ని ప్రాంగణాలను క్రీడాకారులు వినియోగించుకుంటున్నారు. మరికొన్ని ప్రాంగణాలను క్రీడాకారులు వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటాం. ప్రతి ఒక్కరూ క్రీడామైదానాలను సద్వినియోగం చేసుకోవాలి. గ్రామ పంచాయతీలు, ప్రభుత్వ పాఠశాలలు సైతం క్రీడాప్రాంగణాలను ఉపయోగించుకోవాలి.

కేశోరాం కార్మికుల సమ్మె

డిమాండ్‌లు పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన అధికారులు


మాట్లాడుతున్న కౌశిక హరి

పాలకుర్తి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): బసంత్ నగర్ కేశోరాం సిమెంటు కర్మాగారంలో విధులు నిర్వహిస్తున్న పర్మినెంటు, కాంట్రాక్టు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మెరుగైన దీపావళి బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం విధులు బహిష్కరించి సమ్మెకు దిగారు. నెల రోజులుగా వివధ రూపాల్లో నిరసనలు తెలిపినా స్పందించని కంపెనీ అధికారులు ఈ సమ్మెతో సయోధ్యకు వచ్చారు. అధికారులు కంపెనీ ఉన్నతాధికారులతో చర్చించి ఈ నెల 29న మరోసారి పర్మినెంటు కార్మిక సంఘం అధ్యక్షుడు బయ్యపు మనోహర్‌రెడ్డితో పాటు యూనియన్ కమిటీ సభ్యులతో చర్చించి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే కాంట్రాక్టు కార్మికులకు సైతం అదే రోజున పాత అగ్రిమెంటు ప్రకారం బోనస్ చెల్లించేందుకు కృషిచేస్తామని యూనియన్ అధ్యక్షుడు కౌశిక హరికి, కమిటీ సభ్యులకు హామీ ఇచ్చారు. ఈలోపు కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్న కర్ణాటకలోని సేడం వాసవి దత్తా సిమెంటు కర్మాగారాన్ని తాము సందర్శించి అక్కడి కార్మికులకు వర్తించే హక్కులు, బోనస్‌పై చర్చించి పూర్తి వివరాలు సేకరించి ఇక్కడ అమలుపై సాధ్యాసాధ్యాలను పరిగణలోకి తీసుకుంటామని అధికారులు కార్మిక సంఘాలకు వివరించారు. దీంతో కార్మిక సంఘాలు, కార్మికులు సమ్మెను విరమించారు. ఈ సమ్మెకు రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, బీజేపీ రామగుండం నియోజకవర్గ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి తదితరులు మద్దతు తెలిపారు. సమ్మె సందర్భంగా పెద్దపల్లి సీఐ ప్రవీణ్ కుమార్, బసంత్‌నగర్ ఎస్‌ఐ ఆర్ స్వామి ఆధ్వర్యంలో పోలీస్‌లు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో పర్మినెంటు యూనిన్ ప్రదానకార్యదర్శి దాడి మహేష్, కాంట్రాక్టు యూనియన్ అధ్యక్షుడు మాదాసు శ్రీనివాస్, వందలాది మంది కార్మికులు, ఆయా యూనియన్ల మద్దతుదారులు పాల్గొన్నారు.

మంథని హాస్టల్‌లో కలకలం

బాలికకు నగ్న పూజల పేరిట వంట మనిషి వల - హాస్టల్ వర్కర్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు

మంథని, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలోని ఓ హాస్టల్‌లో విద్యార్థినికి నగ్న పూజల పేరిట వంట మనిషి (మహిళ) వల వేసిన సంఘటన స్థానికంగా కలకలం రేపింది. హాస్టల్‌లో ఉంటున్న ఓ బాలికకు డబ్బు ఆశ చూపి వంట మనిషి నగ్న పూజలకు సహకరించాలని కోరినట్లు సమాచారం.

పూజలు చేస్తే లక్ష్మి కటాక్షిస్తుందని నమ్మబలికింది. వారం రోజుల క్రితం ఇందు కోసం హాస్టల్ వర్కర్ కొందరు పూజలు చేసే వారిని సంప్ర దించినట్లు తెలిసింది. దీనితో ఆందోళన చెందిన బాలి క హాస్టల్ నుంచి తప్పించుకుని బంధువుల ఇంటికి వెళ్లి వారం రోజులుగా అక్కడే ఉంటోంది. సోమవారం తల్లిదండ్రులు రావడంతో జరిగిన విషయాన్ని బాలిక వారికి వివరించింది. దీనితో బాలిక బంధువులు, తల్లిదండ్రులు హాస్టల్ వద్దకు వచ్చి వంట మనిషి ని నిలదీశారు. ఆమెతో వాగ్వాదానికి దిగారు. దీంతో హాస్టల్ వద్ద కాసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. పోలీసులకు విషయం తెలియడంతో సీఐ రాజు, ఎస్‌ఐ రమేష్, అక్కడికి చేరుకుని జరిగిన సంఘటనపై ఆరా తీశారు. ప్రలోభ పెట్టిన మహిళను అదుపులోకి తీసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు. బాలిక కుటుంబం సైతం స్టేషన్‌కు వెళ్లి జరిగిన ఘటనపై ఫిర్యాదు చేశారు.

జిల్లాను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం

పెద్దపల్లిటౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సహజ వనరులు పుష్కలంగంగా ఉన్న పెద్దపల్లి జిల్లాను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడించారని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాడూరి శ్రీమన్నారాయణ తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లో తాడూరి శ్రీమన్నారాయణ పెద్దపల్లి జిల్లా పర్యాటక అభివృద్ధి ప్రాధాన్యంపై మంత్రికి వినతిపత్రం సమర్పించారు. జిల్లాలోని రామగిరి ఖిల్లా గుట్టలతో పాటు సబ్బితం జలపాతం, గర్రెపల్లి చెరువును పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దాలని మంత్రిని శ్రీమన్నారాయణ కోరారు. దీంతో సాధ్యమైనంత తొందర గా సబ్బితం జలపాతం వద్ద అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి పర్యాటకులకు అందుబాటులో తీసుకొస్తామని మంత్రి తెలిపారు.

నిందితులను త్వరలోనే పట్టుకుంటాం

కమాన్‌పూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సాగి అంజలి ఇంట్లో జరిగిన దొంగతనం నిందితుల్ని త్వరలోనే పట్టుకుంటామని గోదావరిఖని టూటౌన్ సీఐ నక్క ప్రసాద్‌రావు సోమవారం తెలిపారు. మండల కేంద్రంలోని సాగి అంజలి ఇంట్లో లేని సమయంలో దొంగలు పడి సుమారు 10 తులాల బంగారంతో పాటు లక్ష పదివేల నగదును దొంగలు ఎత్తికెళ్లారు. దొంగతనం జరిగిన ఇంటి పరిసర ప్రాంతాల్లో ఎస్‌ఐ ప్రసాద్, సీసీఎస్ ఎస్‌ఐ మామిడాల చంద్రశేఖర్‌గౌడ్‌తో కలిసి క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు. సీసీ కెమెరాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు.

అనాథ పిల్లలకు ఐసీహెచ్ చేయూత

జ్యోతినగర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీపీసీ ప్రాజెక్టులో ఇండస్ట్రియల్ క్యాంటీన్‌ను నిర్వహిస్తున్న ఇండియన్ కాఫీ హౌజ్(ఐసీహెచ్) సోమవారం రామగుండంలోని తబిత అనాథ ఆశ్రమ విద్యార్థులకు చేయూతనందించింది. ఆశ్రమంలోని 50 మంది అనాథ పిల్లలకు దుస్తులు, రోజువారీ ఉపకరణాలను ఐసీహెచ్ సిబ్బంది అందజేశారు. ఆశ్రమానికి వారం రోజులు సరిపడే బియ్యాన్ని పంపిణీ చేశారు. అలాగే పిల్లలకు భోజనం పెట్టారు. అనాథ చిన్నారులకు తమ వంతుగా సహాయం చేయడం ఆనందంగా ఉందని ఐసీహెచ్ నిర్వాహకులు తెలిపారు. ఆశ్రమానికి చేయూతనందించిన ఐసీహెచ్ సిబ్బందికి ఆశ్రమ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

సాగు ప్రణాళిక ఖరారు

(5వ పేజీ తరువాయి)

ఎకరాల్లో వివిధ రకాల పంటలను సాగు చేశారు. ఇందులో పత్తి పంట పోనూ మిగతా భూముల్లో యాసంగిలో వరి, మొక్కజొన్న, తదితర పంటలను రైతులు సాగు చేయనున్నారు. వానాకాలం పంట కోతలు 80 శాతానికి పైగా పూర్తయ్యాయి. ఈ నెలాఖరుకల్లా మొత్తం వరి కోతలు పూర్తి కానున్నాయి.

● ప్రాజెక్టుల్లో పుష్కలంగా నీరు..

జిల్లాకు వరప్రదాయిని అయిన శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో పుష్కలంగా నీళ్లు ఉన్నాయి. ఆన్‌అండ్‌ఆఫ్ పద్ధతిలో డిసెంబరు మొదటి వారంలోనే సాగు నీటిని విడుదల చేయాలని ప్రభుత్వం భావిస్తున్నది. జిల్లాలో గల శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులో కూడా 19 టీఎంసీల వరకు నీళ్లు ఉన్నాయి. జిల్లాలో ఎస్సారెస్పీ ఆయకట్టు 1,84,000 ఎకరాల భూమి ఉండగా, కాలువ చివరి భూముల వరకు ఈసారి నీళ్లు అందనున్నాయి. ఆన్‌అండ్‌ఆఫ్ పద్ధతిలోనే గాకుండా మధ్యమధ్యలో ఎక్కువ రోజులు నీటిని వదిలి పెట్టే అవకాశాలున్నాయి. సాగునీటికి డోకా లేకపోవడంతో రైతులు చాలామంది వ్యవసాయ బావుల కింద వరి నార్లు పోస్తున్నారు. కాలువ పారకం కింద సాగయ్యే భూముల్లోనూ వరి పండించేందుకు గాను బావుల వద్దనే వరి నార్లు పోస్తున్నారు. దొడ్డు రకంతో పాటు సన్న రకం పంటను కూడా వేస్తున్నారు. గడిచిన సీజన్‌లో అత్యధికంగా జిల్లాలో 80 శాతం సన్న రకం వరి పంటను రైతులు సాగు చేశారు. సన్న రకం ధాన్యం పండించే రైతులకు క్వింటాలుకు 500 రూపాయల బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో చాలా మంది సన్నాలు సాగు చేశారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సన్న రకం ధాన్యం విక్రయించిన రైతుల ఖాతాల్లో 48 గంటల్లో మద్దతు ధర జమ అయిన రెండు రోజులకు బోనస్ డబ్బులు కూడా జమ అవుతున్నాయి. ప్రభుత్వం త్వరగా బోనస్ డబ్బులను ఖాతాల్లో జమ చేస్తుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. యాసంగిలో సన్నాలు సాగు చేస్తే బోనస్ ఇస్తారా, లేదా అనే విషయమై ప్రభుత్వం ఇంకా స్పష్టత ఇవ్వలేదు. దీంతో కొంత మంది రైతులు వరి నార్లు సన్న రకం పోయాలా, దొడ్డురకం విత్తనాలు పోయాలా అనే డైలామాలో పడ్డారు. ఈ విషయమై స్పష్టత ఇవ్వాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. మొత్తం మీద యాసంగి సీజన్‌కు సాగు నీటికి డోకా లేకపోవడంతో రైతులు సాగులో ముందుకు సాగుతున్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి: ఏసీపీ


మాట్లాడుతున్న ఏసీపీ రమేష్

ముత్తారం నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని మండలంలోని దరియాపూర్ శివారులోని మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు గంజాయి, మత్తుపదార్థాల వినియోగం వలన కలిగే నష్టాలపై, సైబర్‌క్రైమ్‌పై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి గోదావరిఖని ఏసీపీ ఎం రమేష్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆధునిక కాలంలో సెల్‌ఫోన్ వినియోగం పెరిగిపోయిందని అన్నారు. గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి ఏటీఎం, పిన్ నంబర్, సీవీవీ, బ్యాంకు ఖాతా తదితర వివరాలు అడిగితే ఇవ్వొద్దని సూచించారు. ఎలాంటి ఆపద సమయంలో సైబర్ నేరాలపై టోల్ ఫ్రీ నంబర్ 1930 లేదా 100కు ఫోన్ చేసి వివరాలు తెలపాలన్నారు. హాస్టల్‌లో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజనం పరిశీలించారు. హాస్టల్ పరిసరాలను, గదులను తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణను పరిశీలించి, పిచ్చి మొక్కలు విపరీతంగా ఉండటంతో వెంటనే బ్లేడ్ ట్రాక్టర్‌ను తెప్పించి హాస్టల్ పరిసరాలను శుభ్రం చేయించారు. కార్యక్రమంలో మంథని సీఐ రాజు, ఎస్‌ఐ నరేష్, కళాశాల అధ్యాపక సిబ్బంది, ముత్తారం పోలీస్ స్టేషన్ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

వేములవాడ కోడెలకు కనుకుల రైతుల పశుగ్రాసం

సుల్తానాబాద్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన కోడెలకు పశుగ్రాసం ఇచ్చేందుకు సుల్తానాబాద్ మండలంలోని కనుకుల రైతులు ముందుకొచ్చారు. ఈ మేరకు కనుకుల గ్రామం నుంచి సింగిల్ విండో ఉపాధ్యక్షుడు కొమ్మిడి వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం కొంత మంది రైతులు 25 ట్రాక్టర్లలో గడ్డిని లోడ్ చేసుకుని వేములవాడకు తరలివెళ్లారు. కార్యక్రమంలో ట్రాక్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్, కుమార్ రెడ్డి, గరిగంటి కుమార్ బాబు, శ్రీనివాస్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మారంలో భూ వివాదం: బాధితుల ఆందోళన

ధర్మారం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): తమకు చెందాల్సిన భూమిని సమాచారం లేకుండా ఇతరులకు అమ్మి, రిజిస్ట్రేషన్ చేసుకోవాలని చూస్తున్నారని, ధర్మారం గ్రామానికి చెందిన జేరుపోతుల పెద్దయ్య కుటుంబసభ్యులు ధర్మారం గ్రామపంచాయతీలో నిరసనకు దిగారు. చివరకు ఎంపీవో రమేష్, కార్యదర్శి రవి బాధితులకు నచ్చజెప్పడంతో శాంతించారు. ధర్మారం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో జేరుపోతుల పెద్దయ్య అనే వ్యక్తికి ప్రభుత్వం కేటాయించిన గుంటన్నర ఇంటి స్థలం ఉంది. ఈ స్థలాన్ని తమకు తెలియకుండా ఇతరులకు అమ్మారని పెద్దయ్య కుటుంబసభ్యులు ఆరునెలల క్రితం కోర్టులో కేసు వేశారు. కేసు విచారణలో ఉండగా కొనుగోలు దారులు స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసుకునే ప్రయత్నం చేస్తున్నారని పెద్దయ్య అన్నదమ్ము లు, వారి పిల్లలు సోమవారం పెద్దపల్లి కలెక్టరేట్‌లో ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.

స్పందించిన అధికారులు వివరాలు సేకరించి సమస్య పరిష్కరించాలని ధర్మారం గ్రామ పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు కాపీని పంపారు. కాగ పెద్దయ్య అన్నదమ్ములు, వారి పిల్లలు సోమవారం గ్రామ పంచాయితికి చేరుకొని స్థల రిజిష్ట్రేషన్‌కు పర్మిషన్ ఇచ్చి పరోక్షంగా సహరిస్తున్నార ని ధర్మారం సెక్రెటరీ రవిని నిలదీశారు. తాను ఎలాంటి పర్మిషన్ ఇవ్వలేదని, కేవలం ఇంటి పన్ను కట్టినందుకు నోడ్యూ సర్టిఫికెట్ ఇచ్చినట్లు కార్యదర్శి తెలిపారు. ఎంపీవో రమేష్ అక్కడకు చేరుకొని ఫిర్యాదు కాపీకి బదులుగా ప్రత్యుత్తర కాపీని రిజిష్ట్రేషన్ కార్యాలయంతో పాటు కలెక్టరేట్‌కు పంపిస్తామని కుటుంబ సభ్యులకు నచ్చజెప్పడంతో శాంతించారు.

పెరిగిన చలి తీవ్రత

కళ్యాణ్‌నగర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గత 15 రోజులుగా రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో చలితీవ్రత పెరగడంతో జ్వరం, గొంతు నొప్పి, దగ్గు, జలుబు, శ్వాసకు సంబంధించిన వ్యాధులతో బాధపడుతూ గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చేరుతున్నారు. చలి తీవ్రత ఎక్కువ కావడంతో వ్యాధులు విజృంభిస్తున్నాయి. సాధారణ ఉష్ణోగ్రతల కంటే నాలుగు డిగ్రీలు రాత్రిపూట ఉష్ణోగ్రతలు తగ్గడంతో చాలా మందికి శ్వాసకోశ వ్యాధులు తీవ్రమవుతున్నాయి. రోజుకు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో 30 నుంచి 50కేసులు దగ్గు, జలుబు, గొంతు నొప్పితో బాధపడుతూ ఇన్ పేషెంట్లుగా అడ్మిట్ అవుతున్నారు. చిన్న పిల్లల్లో ఎక్కువగా జలుబు, దగ్గు, శ్వాస ఆడకపోవడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. దీంతో చిన్న పిల్లల ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. ఉదయం చలి ప్రభావంగా ఎక్కువ చూపడంతో పాటు మంచు కురుస్తుంది. 8గంటలు దాటినా సూర్యుడు కనిపించడం లేదు. రాత్రి 7గంటలు దాటితే రోడ్లపై సంచారం తగ్గుతుంది. దీంతో మరో పక్క వాయుకాలుష్యం కూడా పెరగడంతో తొందరగా ఒకరి నుంచి జలుబు, దగ్గు వంటి వ్యాధులు వ్యాపిస్తున్నాయి. ఆస్తమా రోగులు శ్వాస ఆడక ఇబ్బందులు పడుతున్నారు. చలి పంజా విసురుతుం డడంతో మరో రెండు నెలలు చలి ప్రభావం ఎలా ఉంటుందోనని ప్రజలు జంకుతున్నారు.

దగ్గు, జలుబు, శ్వాసకోశ వ్యాధులతో ఆసుపత్రి పాలవుతున్న ప్రజలు


ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు



బొగ్గు నాణ్యతపై సమీక్షా సమావేశం


అధికారులతో చర్చిస్తున్న జీఎం వెంకటయ్య

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): బొగ్గు నాణ్యతా ప్రమాణాలపై ఆర్జీ-2 జీఎం వెంకటయ్య సోమవారం ఓసీపీ-3 అధికారులతో సమావేశమయ్యారు. డిప్యూటీ మేనేజర్ క్వాలిటీ సుభాష్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా రోజువారీ బొగ్గు నాణ్యతా వివరాలను తెలియజేశారు. బొగ్గు నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని, వినియోగదారులకు సకాలంలో నాణ్యమైన బొగ్గును సరఫరా చేయాలని సూచించారు. బొగ్గులో మట్టి, షెల్ రావడం వలన గ్రేడ్ తగ్గి సంస్థకు నష్టం వాటిల్లుతుందని జీఎం పేర్కొన్నారు. బొగ్గు నాణ్యతా పెంచేలా దృష్టి సారిం చాలని అధికారులకు జీఎం వెంకటయ్య సూచించారు. ఈసమావేశంలో పీఎఓ మధుసూదన్, ఎస్వోటూ జీఎం రాముడు, పీఈ రాజాజీ, అధికారులు సంతోష్‌కు మార్, భరత్‌కుమార్, సదానందం, నీలేష్ మహేంద్ర, రావుల పాపయ్య, గోపాలకృష్ణారెడ్డి, పాండె, మనోజ్‌కుమార్, లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు.

7ఎల్‌ఈపీ గనిని సందర్శించిన జీఎం

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఆర్జీ-2 జీఎం వెంకటయ్య 7ఎల్‌ఈపీ గనిని సోమవారం సందర్శించారు. మూతపడిన గని రక్షణ చర్యలను అధికారులను అడిగి జీఎం తెలుసుకున్నారు. గనిలోకి దిగి పరిశీలించారు. త్వరలో జరగనున్న జాతీయస్థాయి రెస్క్యూ పోటీలకు జీడీకే 7ఎల్‌ఈపీ గనిలో సాధన చేస్తున్న సింగరేణి జట్లను అయన పరిశీలించారు. జాతీయస్థాయి పోటీలకు అనుగుణంగా గనిలో ఏర్పాట్లు చేయాలని జీఎం వెంకటయ్య అధికారులకు సూచించారు. జీఎం వెంట ఓసీపీ-3 పీఓ మధుసూదన్, గని పీవో నెహ్రూ, ఎస్వోటూ జీఎం రాముడు, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ సంతోష్‌కుమార్, మేనేజర్ సురేష్‌బాబు, ఇంజనీర్ చంద్రశేఖర్ ఉన్నారు.

సుల్తానాబాద్‌లో సమగ్ర సర్వే పూర్తి

వివరాలను ఆన్‌లైన్ చేస్తున్న సిబ్బంది


సర్వే వివరాలను కంప్యూటరీకరణ చేస్తున్న సిబ్బంది

సుల్తానాబాద్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇంటింటి సర్వే కార్యక్రమం సుల్తానాబాద్ మండలంలో పూర్తయింది. మండలంలోని 27 గ్రామాల్లో 15,027 కుటుంబాలకు చెందిన పూర్తి వివరాలను ఎన్యూమరేటర్లు ఇంటింటికి తిరిగి సేకరించారు. కుటుంబాల యజమానులు చెప్పిన మేరకు వారి కుటుంబసభ్యుల వివరాలను, వారు చెప్పిన సమాచారాన్ని, స్వచ్ఛందంగా చూపిన పత్రాల ఆస్తుల వివరాలను ఎన్యూమరేటర్లు నమోదు చేసుకున్నారు. 27 గ్రామాల్లో 108 మంది ఎన్యూమరేటర్లు సర్వేకు నియమింపబడ్డారు. ఆయా గ్రామాల్లో ఇళ్లిళ్లు తిరుగుతున్నపుడు యజమానులు ఉన్నవారి వివరాలను స్వయంగా నమోదు చేసుకున్నారు. డోర్ లాక్ చేసి ఉన్న వారి వివరాలను చుట్టుపక్కల వారి ద్వారా సంపాదించిన వారి ఫోన్‌నంబర్లతో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. మరి కొందరు ఏ గ్రామాల్లోనైనా, పట్టణాల్లోనైనా ఉన్నా కూడా ఆయా ఇంటికి వచ్చే ఎన్యూమరేటర్లకు కూడా వివరాలు తెలిపి నమోదు చేయించుకున్నారని అధికారులు తెలిపారు.

ఇంటింటి సర్వే ద్వారా సేకరించిన వివరాలన్నింటినీ కంప్యూటరీకరణ కార్యక్రమాన్ని ప్రారంభించామని ఎంపీడీవో దివ్యదర్శన్ రావు తెలిపారు. ఇందుకు గాను 35 మంది కంప్యూటర్ డేటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించామని, ఆపరేటర్లకు సహాయకులుగా పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉంటున్నారని వివరించారు. రెండు షిఫ్టుల వారీగా ఎంట్రీ నమోదు కార్యక్రమం నడుస్తుందని, ఉదయం నుంచి సాయంత్రం వరకు కొందరు, సాయంత్రం నుంచి రాత్రి వరకు మరికొందరు ఈ డాటా ఎంట్రీ పనులు చేస్తున్నారని చెప్పారు. రాత్రి పూట ఉన్న సిబ్బందికి ఉద్యోగులకు వసతి సౌకర్యం కూడా కల్పిస్తున్నట్లు తెలిపారు. మొత్తం మీద వేగవంతంగా కంప్యూటరీకరణ పనులు చేపడుతు ఈ నెల 29 వరకు పూర్తి చేస్తామని అన్నారు. కంప్యూటర్ ఎంట్రీ నమోదు రాష్ట్ర కార్యాలయానికి కనెక్ట్ అవుతుందన్నారు.

ఆన్‌లైన్ డేటా ఎంట్రీ త్వరగా చేయాలి

కమాన్‌పూర్ (ఆంధ్రజ్యోతి): సమగ్ర కుటుంబ సర్వే ఆన్‌లైన్ ఎంట్రీ త్వరగా పూర్తచేయాలని డివిజనల్ పంచాయతీ అధికారి కొమ్మెర సతీష్ సూచించారు. ఎంపీడీవో కార్యాలయంలో జరుగుతున్న ఆన్‌లైన్ ఎంట్రీలను సోమవారం అయన పరిశీలించారు. మండలంలో తొమ్మిది గ్రామాల్లో 8,975 దరఖాస్తులు వచ్చాయని, ఇందులో భాగంగా మూడు రోజులుగా జరుగుతున్న ఎంట్రీలో ఇప్పటి వరకు 1,195 దరఖాస్తులు నమోదు అయినట్లు తెలిపారు. పైస్థాయి అధికారుల ఆదేశానుసారం వెంటవెంటనే పూర్తి చేయాలని కోరారు. ఎంట్రీ రిపోర్టు వెంట వెంటనే అధికారులకు పంపించాలని సూచించారు. ఈయన వెంట ఇన్‌చార్జి ఎంపీడీవో కాటం భాస్కర్, కార్యదర్శులు కుమార్, అంబటి శంకర్ తదితరులు ఉన్నారు.

● ఉత్తమ కూలీలను సన్మానించాలి

ప్రజాపాలన విజయోత్సవ భాగంగా ఉత్తమ ఉపాధి కూలీలను సన్మానించేందుకు సిబ్బంది చర్యలు చేపట్టాలని డివిజనల్ పంచాయతీ అధికారి సతీష్ సూచించారు. ఉపాధిహామీ పనిలో ఎక్కువ రోజులు పనిచేసిన కూలీలను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధిహామీ ఏపీవో లావణ్య, కార్యదర్శిలు రాజ్‌కుమార్, అంబటి శంకర్, బచ్చుల ప్రసాద్, రామ్మోహన్, అమల, అమీనా, ప్రవళిక తదితరులు ఉన్నారు.

రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం

ఓదెల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన ప్రారంభం నుంచి రైతు సంక్షేమమే ధ్యేయంగా సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేమ్‌సాగర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కనగర్తిలో సోమవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా సాగర్‌రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం రైతులకు బోనస్ ప్రకటించి అమలు చేసి చూపించిందన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ ఆళ్ళ సుమన్ రెడ్డి, మచ్చ నర్సింగరావు, చొప్పరి రాజయ్య, సిరిసేటీ రాహుల్, ఉడిగే సదయ్య, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాతిగా నిలుస్తోందని మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్ అన్నారు. సోమవారం మండలంలోని మీర్జంపేట్ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రంలో బోనస్‌పై సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా టపాసులు పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయానికి పెద్దపీట వేసి అనేక రైతు సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య, వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ సబ్బని రాజమల్లు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ధర్మారం: మండలంలోని మేడారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కలెక్టర్ కోయ శ్రీహర్ష 102 వాహనం కేటాయించారని డాక్టర్ సుష్మిత తెలిపారు.

కమాన్‌పూర్: మండల కేంద్రానికి చెందిన కౌమ్మల స్వరూప అనే మహిళ ఇంటిని ఆమె భర్త శ్రీనివాస్ మతిస్థిమితం లేక ఇంటికి నిప్పు పెట్టడంతో ఆదివారం రాత్రి ఇల్లు దగ్ధమైంది. ప్రమాదంలో రూ. 10 లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది.

ముత్తారం: మండల కేంద్రంతో పాటు కస్తూర్బా పాఠశాలలో గ్రామ దత్తత కార్యక్రమంలో (వీపీవో)లో భాగంగా, ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి ఎన్‌ఐఎఫ్ టీమ్ కార్యకలాపాలను నిర్వహించింది.

కోల్‌సిటీటౌన్: మేదరి సంఘం రామగుండం కార్పొరేషన్ అధ్యక్షుడిగా రెడ్డి భాస్కర్ ఎన్నికయ్యారు.

-గోదావరిఖనిలోని సింగరేణి పాఠశాలలోని విద్యార్థులు స్టడీ టూర్‌లో భాగంగా సోమవారం జైపూర్ పవర్ ప్లాంట్, సోలార్ ప్లాంట్‌ను సందర్శించారు.

అంతర్గాం: లింగాపూర్ గ్రామంలో అనాథలుగా మారిన ధర్మారపు శివాని, శిల్పానిలకు వీహెచ్‌ఆర్ ఫౌండేషన్ రూ.15వేల ఆర్థిక సహాయం అందించింది.

రామగిరి: భారతప్రభుత్వం నిర్వహిస్తున్న ఇండియా ఇంట ర్నేషన్ సైన్స్ ఫేస్టీ 2024 సంవత్సరానికి వాణి విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎంపికయ్యారు.